## విలేకరులు కావలెను

భారత్ RNI.APTEL/16364/2023 తెలుగు దినపత్రిక BHARATH REPORTER రిపోర్టర్

తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న భారత్ రిపోర్టర్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను.తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికీ, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికీ ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి:

**7668886666**



Postal Licenced No: HDP/010/2024-2026

# భారత్ రిపోర్టర్

RNI.APTEL/2023/88573 తెలుగు దినపత్రిక

BHARATH REPORTER రిపోర్టర్

BHARAT REPORTER RNI.APTEL/2023/88573 TELUGU DAILY NEWS PAPER

అనంతపురం - సంపుటి : 01 సంచిక : 240 ఎడిటర్.. కొట్లపల్లి ఫాజియా పేజీలు : 08, వెల . రూ. 2/- గురువారం - 17 - ఏప్రిల్ - 2025


## చైనాకు ట్రంప్ మరో షాక్..
## ఈసారి ఊహించని విధంగా భారీగా సుంకం పెంపు!



- చైనా, అమెరికా మధ్య తారస్థాయికి సుంకాల యుద్ధం
- చైనా దిగుమతి వస్తువులపై సుంకం 145 నుంచి 245 శాతానికి పెంపు
- యూఎస్ వస్తువులపై చైనా 125 శాతం సుంకం
- చైనా దిగుమతి సుంకాలు పెంచినందుకే ఈ చర్య అన్న వైట్‌హౌస్

న్యూఢిల్లీ : అగ్రరాజ్యం అమెరికా, డ్రాగన్ కంట్రీ చైనా మధ్య సుంకాల యుద్ధం తారస్థాయికి చేరింది. చైనా దిగుమతి వస్తువులపై సుంకాన్ని మిగతా..2లో

## కంచ గచ్చిబౌలి భూముల్లోని
## చెట్ల నరికివేతపై సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు



- అనుమతుల్లేకుండా చెట్లు కొట్టివేసినట్లైతే సీఎస్ సహా అధికారులంతా జైలుకేనని వార్నింగ్
- తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందన్న అమికస్ క్యూరీ
- ఆ చట్ట ప్రకారమే చెట్ల నరికివేత చేపట్టినట్లు కోర్టుకు వివరణ

హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఆ భూముల్లో చెట్ల నరికివేతపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

2లో

## సుప్రీంకోర్టు తదుపరి
## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్



- కేంద్ర న్యాయ శాఖకు సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- మే 13వ తేదీన ముగియనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం
- మే 14న నూతన సీజేఐగా ప్రమాణం చేయనున్న జస్టిస్ బీఆర్ గవాయ్

2లో




### రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం

- రూ.4,668 కోట్ల వ్యయంతో నిర్మాణం
- వేగంగా అమరావతి నిర్మాణ పనులు
- ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు.. మంత్రులతో కమిటీ

అమరావతి : అమరావతి రాజధాని పనులు ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు నిధులు సమకూర్చుకుంటూ టెండర్లను కూడా పిలుస్తున్నారు.

# 16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై
# ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజంటేషన్

**రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు వివరిస్తూ వీడియో ప్రదర్శన**





2లో



అమరావతి : రాష్ట్రానికి వచ్చిన 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు నాయుడు వివిధ అంశాలపై వీడియో ప్రజంటేషన్ ఇచ్చారు. వీటిలో ఏపీ ఏపీ వృద్ధికి అనుకూలతలు, స్వర్ణాంధ్ర-2047 విజన్, వినూత్న కార్యక్రమం పీ4 వంటి తదితర అంశాలు ఉన్నాయి.

**ఏపీ వృద్ధికి అనుకూలతలు..**

అతిపెద్ద తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ తూర్పు దేశాలకు గేట్‌వేగా ఉంది. 3 పారిశ్రామిక కారిడార్లు, విశాఖ-చెన్నయ్, చెన్నై-బెంగళూరు, బెంగళూరు-హైదరాబాద్ కారిడార్లు ఉన్నాయి. 6 పోర్టులు, 7 ఎయిర్ పోర్టులు ఉన్నాయి.

దేశ ఎగుమతుల్లో 5.8 శాతం రాష్ట్రం నుంచే అవుతున్నాయి. బ్లూ ఎకానమి, ఐటీ, నాలెడ్జ్ ఎకానమి, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్, ఐఓటీ, బ్లాక్ చెయిన్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందుంది. గ్రీన్ హైడ్రోజన్, సోలార్, అమోనియా... ఇలా గ్రీన్ ఎనర్జీకి ఏపీ హబ్‌గా ఉంది. అటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు అమరావతికి చేరువలో ఉన్నాయి. మిగతా..2లో

- రాష్ట్ర పురోగతిపై ఫొటో ఎగ్జిబిషన్
- ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించిన సీఎం చంద్రబాబు
- ఏపీని ఆర్థికంగా ఆదుకోవాల్సిన పరిస్థితిపై సీఎం చంద్రబాబు ప్రెజెంటేషన్
- అమరావతి రాజధానిపై స్పెషల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.
- అప్పులు, వాటికి అవుతున్న వడ్డీలతో ప్రగతి రథం ముందుకు కదలడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు సీఎం చంద్రబాబు
- రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు వివరిస్తూ వీడియో ప్రదర్శించి వివరించారు సీఎం
- ఏపీ పరిస్థితి, అప్పులపై ఆర్థిక సంఘానికి సీఎం వివరణ.. ప్రత్యేక సాయం వచ్చేలా చూడండి..!



### మా కార్పొరేటర్లపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు..

అమరావతి : : జీవీఎంసీలో బలం లేకపోయినా అవిశ్వాస తీర్మానాన్ని కూటమి నేతలు పెట్టారు అని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బీసీ మహిళను మేయర్ పీఠం నుంచి దించే ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లపై గత నెల రోజుల నుంచి బెదిరింపులు, దౌర్జన్యాలకు మిగతా..2లో

## కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు.. స్పందించిన కేటీఆర్



- సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్న కేటీఆర్
- రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికైనా జ్ఞానోదయం కలగాలన్న కేటీఆర్
- ముఖ్యమంత్రి రూ. 10 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతున్నారని ఆరోపణ

హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూములకు సంబం ధించి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై బీ ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పం దించారు. 400 ఎకరాలకు సం బంధించిన భారత అత్యున్నత న్యాయ స్థానం వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని

## ఈ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వడం సంతృప్తినిచ్చింది.. కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

2లో



- ఈ చొరవలో తాను భాగస్వామి అయినందుకు ఆనందం వ్యక్తం చేశారు
- దీనిపై ట్విట్టర్ వేదికగా స్పందించిన కేంద్రమంత్రి.. పలు కీలక వ్యాఖ్యలు
- రాష్ట్రం అవతల బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించడం సింగరేణి సంస్థ చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టం

# నైనీ బొగ్గు గనిలో తవ్వకాలు

**- 13 దశాబ్దాల 'సింగరేణి' చరిత్రలో ఇదే మొదటిసారి...!**



2లో

- ఒడిశాలో సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభమైంది
- సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయ
- అంగూల్ జిల్లాలో నైనీ బొగ్గు బ్లాక్ ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వర్చువల్ గా ప్రారంభించారు.
- 2016 మే నెలలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సింగరేణికి కేటాయించింది
- ఇదోక ఒక చరిత్రాత్మక ఘట్టంగా అధికారులు పేర్కొన్నారు.
- సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగుపెట్టినట్లు అయింది.

రకాల అనుమతులు సాధించినప్పటికీ... తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్ళ సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. ఇటీవలే కాలంలో ప్రభుత్వం ఈ తవ్వకాల విషయంలో మరింత దృష్టి పెట్టడంతో లైన్ క్లియర్ అయిపోయింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అధికారులు ఒడిశా రాష్ట్రంలో ప్రత్యేకంగా పర్యటించి.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితోనూ, సంబంధిత అధికారులతోనూ సంప్రదింపులు జరిపారు. గని ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ వల్ల సింగరేణికి అతిపెద్ద బొగ్గు బ్లాక్ లభించింది. తద్వారా వార్షిక అధికోత్పత్తి సాధనకు మార్గం సుగమమై సంస్థ ఆర్థిక పటిష్టతకు దోహద పడనుంది.

హైదరాబాద్ : సింగరేణి సంస్థ సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. బయటి రాష్ట్రంలోని గనిలో తొలిసారిగా తవ్వకాలను ప్రారంభించింది. 13 దశాబ్దాల సింగరేణి సంస్థ చరిత్రలో ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులో తవ్వకాలు ప్రారంభించటంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నైనీ బొగ్గు గనిలో తవ్వకాలు

ఒడిశాలో సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభమైంది. 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలోకి సింగరేణి సంస్థ అడుగుపెట్టింది. అంగూల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వర్చువల్ గా ప్రారంభించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం వరకే మిగతా..2లో

### ఒడిశాలో నైనీ గని ప్రారంభం.. సింగరేణికి జాతీయ విస్తరణలో కొత్త అధ్యాయం



హైదరాబాద్ : : ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గనిని వర్చువల్‌గా ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మరియు ఇంధన శాఖా మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, ఈ ఘట్టం సింగరేణి కంపెనీ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మిగతా..2లో

## బెంగాల్ హింస వెనుక అమిత్ షా హస్తం: మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు



2లో


- ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన హింస అన్న మమతా బెనర్జీ
- అమిత్ షా, బీఎస్ఎఫ్ కలిసి బంగ్లాదేశీయులను బెంగాల్‌లోకి వదిలారని ఆరోపణ
- అమిత్ షాను ప్రధాని నరేంద్ర మోదీ నియంత్రించాలని సూచన

## గుజరాత్ నుంచే మార్పు మొదలు : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : : కేవలం కాంగ్రెస్ మాత్రమే భాజపా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను ఓడించగలదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆయన గుజరాత్ పర్యటనలో భాగంగా జిల్లా నాయకులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

## ప్రమాదంలో హైదరాబాద్.. అడుగంటిన భూగర్భ జలాలు..



2లో

- వాటర్ ట్యాంకర్లే దిక్కు..!

హైదరాబాద్ : విశ్వనగరంగా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ లో నీటి కష్టాలు మొదలయ్యాయి. చాలా చోట్ల భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. జనవరి నుంచి మార్చి నెలాఖరుకే గ్రేటర్ లో భూగర్భ జలాలు 25 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. మే చివరి నాటికి ప్రమాదకర స్థాయిలో నీటి నిల్వలు మరింత పడిపోతాయని భూగర్భశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

## చైనాకు ట్రంప్ మరో షాక్..
## ఈసారి ఊహించని విధంగా భారీగా సుంకం పెంపు!

మొదటి పేజి తరువాయి

డొనాల్డ్ ట్రంప్ సర్కార్ 145 శాతం నుంచి 245 శాతానికి పెంచేసింది. తమ వస్తువులపై ప్రతీకారంగా చైనా దిగుమతి సుంకాలు పెంచిన నేపథ్యంలో ఈ చర్యకు దిగినట్లు అధికార భవనం వైట్‌హౌస్ వెల్లడించింది. అమెరికా దిగుమతి సుంకాన్ని పెంచిన నేపథ్యంలో.. రెండు రోజుల క్రితం చైనా కూడా కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా సంస్థ బోయింగ్ ఉత్పత్తి చేస్తున్న విమానాలను కొనుగోలు చేయవద్దని తమ దేశ విమానయాన సంస్థలను చైనా ఆదేశించిన విషయం తెలిసిందే. బోయింగ్ సంస్థ నుంచి విడిభాగాలు కూడా కొనుగోలు చేయరాదు అని చైనా తమ దేశ ఎయిర్‌లైన్స్ సంస్థలను ఆదేశించింది. ఈ ప్రకటన వెలువడిన మరుసటి రోజే అమెరికా ప్రతీకార చర్యకు పాల్పడింది. చైనా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై సుంకాన్ని ఏకంగా 245 శాతానికి పెంచినట్లు శ్వేతసౌధం వెల్లడించింది. దీంతో చైనా నుంచి దిగుమతి అయ్యే వస్తువుల ధరలు అమెరికాలో విపరీతంగా పెరగనున్నాయి. ఫలితంగా అమెరికన్లు చైనా వస్తువులను కొనుగోలు చేయడం ఆపేయడంతో ఆ దేశ కంపెనీలు తీవ్రంగా నష్టపోతాయి. కాగా, యూఎస్ వస్తువులపై చైనా 125 శాతం సుంకాన్ని విధిస్తున్న విషయం తెలిసిందే.

## కంచ గచ్చిబౌలి భూముల్లోని
## చెట్ల నరికివేతపై సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

అనుమతులు తీసుకోకుండా చెట్లను కొట్టివేసినట్లు తేలితే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సహా సంబంధిత అధికారులు అందరినీ జైలుకు పంపిస్తామని హెచ్చరించింది. ఈ మేరకు కంచ గచ్చిబౌలి భూ ముల వివాదంపై బుధవారం జరిగిన విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. చెట్లు కొట్టేసే ముందు 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారా లేదా స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయ్ తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యా యవాది అభిషేక్ మను సింఘ్వీని ప్రశ్నించారు. చట్ట ప్రకారం అనుమతులు తీసుకున్నాకే జామాయిల్ తరహా చెట్లు, పొదలను తొలగించినట్లు సింఘ్వీ కోర్టుకు తెలిపారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ చట్టం ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. రూ.10వేల కోట్లకు మార్టిగేజ్ చేశారని సీఈసీ నివేదికలో పొందుపరిచిన వివరాలను అమికస్ క్యూరీ కోర్టు దృష్టికి తీసుకురాగా, చెట్ల నరికి వేతకు అనుమతులు తీసుకున్నారా లేదా అనేదే తమకు ముఖ్యమని, ఆ భూముల మార్టిగేజ్ విషయం తమకు అనవసరమని జస్టిస్ బీఆర్ గవాయి తేల్చి చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశిస్తూ కేసు విచారణను మే 15వ తేదీకి వాయిదా వేసింది.

## సుప్రీంకోర్టు తదుపరి
## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్

న్యూఢిల్లీ : భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీ.ఆర్. గవాయ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఆయన పేరును ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా కేంద్ర న్యాయ శాఖకు సిఫార్సు చేశారు.సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం మే 13వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత రోజు మే 14న నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్. గవాయ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ గవాయ్ నవంబర్ నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన ఆరు నెలల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. కేజీ బాలకృష్ణన్ తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి చేపడుతున్న రెండో దళిత జడ్జి జస్టిస్ గవాయ్. ఆయన మహారాష్ట్రలోని అమరావతికి చెందినవారు. మహారాష్ట్ర హైకోర్టు జడ్జిగా పనిచేసిన రాజా భోన్సాలేతో కలిసి పనిచేశారు. బాంబే హైకోర్టులో 1987 నుంచి 1990 మధ్య కాలంలో న్యాయవాదిగా విధులు నిర్వర్తించారు. 2000 సంవత్సరంలో ప్రభుత్వ ప్లీడరు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. 2003లో హైకోర్టులో అదనపు జడ్జి బాధ్యతలను స్వీకరించారు. 2005లో పూర్తిస్థాయి జడ్జిగా నియమితులయ్యారు. 2019లో ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు.

## రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం

మొదటి పేజి తరువాయి

తాజాగా రాజధానిలో సచివాలయ టవర్ల నిర్మాణానికి సీఆర్డీయే టెండర్లను ఆహ్వానించింది. సచివాలయానికి నాలుగు, హెచ్ ఓడీ కార్యాలయానికి ఒక టవర్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది. హెచ్వోడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లకు టెండర్లు పిలిచింది. సచివాలయం 1, 2 టవర్ల కోసం రూ.1,897 కోట్లతో మరో టెండర్ను ఆహ్వానించింది. సచివాలయం 3, 4 టవర్ల కోసం రూ.1,664 కోట్లతో టెండర్లు జారీ అయ్యాయి. మొత్తం రూ.4,668 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మే 1న సచివాలయం, హెచ్ ఓడీ టవర్ల టెక్నికల్ బిడ్స్ తెరవనున్నారు. వీటితోపాటు సచివాలయంలో సీసీ కెమెరాలు,. కమాండ్ కంట్రోల్ కు టెండర్లు పిలిచారు. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.77,249 కోట్లు అవసరం కాగా... వరల్డ్ బ్యాంక్, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్మెంట్ బ్యాంక్ ద్వారా ఫండింగ్ రూ.31,000 కోట్లు సమకూరాయి. ఇంకా నిధులు రూ.47,000 కోట్లు కావలపి ఉంది. ఈరోజు 16వ ఆర్థిక సంఘ సభ్యులతో జరిగిన సమావేశంలోనూ ముఖ్యమంత్రి ఈ విషయాలను ప్రస్తావించారు. అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వచ్చే నెల 5వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి రానున్నారు. ఏపీలో ప్రధాని పర్యటన సక్సెస్ కు మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది ఉపసంఘంలో సభ్యులుగా మంత్రులు పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, నారాయణను నియమించారు. మరో వైపు పురపాలక శాఖ మంత్రి నారాయణ అమరావతి రాజధానిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రాజధాని నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం పలకడం మరో ముందుడుగుగా అంతా భావిస్తున్నారు.

## మా కార్పొరేటర్లపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు..

మొదటి పేజి తరువాయి

పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ కార్పొరేటర్లకు విప్ జారీ చేస్తున్నాం.. ఈ నెల 19వ తేదీన జరిగే అవిశ్వాస తీర్మానంలో ఎవరు పాల్గొనకూడదని వెల్లడించారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయేందుకు సరిపడ బలం మాకు ఉంది.. వైస్రాయ్ హోటల్ రాజకీయాలకు చంద్రబాబు స్వస్తి పలకాలి అని వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ చెప్పుకొచ్చారు. ఇక, విశాఖ మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ.. మహిళల మీద గౌరవంతో వైఎస్ జగన్ మేయర్ గా నాకు అవకాశం కల్పించారు.. బీసీ జనరల్ అయినా సరే యాదవ మహిళకు మేయర్ గా అవకాశం ఇచ్చారు.. యాదవులకు వైఎస్ జగన్ పెద్దపీట వేశారని పేర్కొన్నారు. యాదవుల కోరిక మేరకు భవన నిర్మాణం కోసం 50 సెంట్లు స్థలాన్ని కేటాయించారు.. కీలకమైన పదవులు యాదవులకు కట్టబెట్టారు.. కుట్ర కుతంత్రాలతో యాదవ వర్గానికి చెందిన మహిళను పదవి నుంచి దించేయాలని చూడడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించింది. యాదవుల కన్నీరు మంచిది కాదంటూ గతంలో ఎమ్మెల్యే వంశీ చెప్పారు.. ఇప్పుడు యాదవుల కన్నీరు వంశీకి కనిపించడం లేదా అని క్వశ్చన్ చేసింది. సోదర సమానులైన పల్లా శ్రీనివాస్, వంశీ అవిశ్వాసాన్ని ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసం అపి హరి వెంకట కుమారి పేర్కొన్నారు.

## బెంగాల్ హింస వెనుక అమిత్ షా హస్తం
## : మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ : వక్ఫ్ చట్టం-2025కి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో ప్రారంభమైన నిరసనలు హింసాత్మకంగా మారడానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కారణమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన హింస అని వ్యాఖ్యానించారు. అమిత్ షా, బీఎస్ఎఫ్ కలిసి కుట్రపూరితంగా బంగ్లాదేశీయులను బెంగాల్‌లోకి వదిలారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలపై దర్యాప్తు సంస్థలను అస్త్రంగా ఉపయోగించి భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలకు సంబంధించిన దృశ్యాలను బెంగాల్‌లో జరుగుతున్నట్లుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో తమ పార్టీ ముందుందని, కాబట్టి ప్రజలు శాంతియుతంగా నిరసన తెలపాలని ఆమె సూచించారు.

### ఒడిశాలో నైనీ గని ప్రారంభం.. సింగరేణికి జాతీయ విస్తరణలో కొత్త అధ్యాయం

మొదటి పేజి తరువాయి

ఇది కేవలం ఒక గని ప్రారంభం మాత్రమే కాదు, తెలంగాణ రాష్ట్ర ప్రగతికి, గర్వానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఒడిశాలో గని ప్రారంభించటం ద్వారా సింగరేణి దేశవ్యాప్తంగా తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇది సంస్థ యొక్క గ్లోబల్ దిశగా అడుగులు వేయడంలో కీలక ఘట్టమని చెప్పారు. నైనీ గనిలో మొదటి మెట్టు వేయడం ద్వారా వాణిజ్య, పారిశ్రామిక విస్తరణకు మార్గం సున్నీత్యమవుతుందన్నారు. ఈ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి కంపెనీకి కేటాయించి తొమ్మిది సంవత్సరాలు పూర్తయ్యాయి. కానీ వివిధ అనుమతుల కొరత కారణంగా గని ప్రారంభానికి జాప్యం జరిగింది. “ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే, అనుమతులన్నింటికీ కావాల్సిన పచ్చజెండా వచ్చేలా చర్యలు తీసుకున్నాం” అని భట్టి తెలిపారు. భట్టి విక్రమార్క ఈ సందర్భంగా, ఒడిశాలో తెలంగాణ ఆధ్వర్యంలో గని ఏర్పడటం ఒక అరుదైన గౌరవంగా అభివర్ణించారు. ఇది తెలంగాణ మేధావితనానికి, పరిపాలనా నైపుణ్యానికి గుర్తింపుగా నిలుస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణి విస్తరించడం ప్రజాపాలనలో నూతన అధ్యాయంగా పేర్కొన్నారు. “ముందు తరాల కోసం, కొత్త మార్కెట్ల కోసం, సింగరేణి త్వరలో గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుంది,” అని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ తత్వానికి అనుగుణంగా పరిశ్రమల ప్రోత్సాహం, కొత్త అవకాశాల సాధన లక్ష్యంగా సింగరేణి ముందుకు సాగుతోందని చెప్పారు.

## 16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజంటేషన్

మొదటి పేజి తరువాయి

ఈ నాలుగు నగరాలను కలుపుతూ దక్షిణ భారతదేశం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే వికసిత్ భారత్ లక్ష్యంలో భాగం అవుతుంది.

స్వర్ణాంధ్ర-2047 విజన్..

భారతదేశాన్ని 2047 కల్లా వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు విజన్ రూపొందించుకున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో పది సూత్రాల ప్రణాళిక అమలు చేస్తున్నాం. ప్రతి కుటుంబానికి కనీస అవసరాలు తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

ప్రతి ఒక్క కుటుంబానికి సొంతిళ్లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, కుళాయి కనెక్షన్, వంటగ్యాస్, సమృద్ధిగా విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, విద్యుత్ ఆదా చేసే వీధి లైట్లు, పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాం.

వినూత్న కార్యక్రమం పీ4..

జీరో పావర్టీ లక్ష్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు ఆదుకునే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. సమాజంలో అసమానతలు తొలిగేలా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. జనాభా వృద్ధిపైనా దృష్టి సారించాం.

స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాలు..

ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ అవతరించేలా కృషి చేస్తున్నాం. అలాగే తలసరి ఆదాయం 42,000 వేల డాలర్లకు చేరడంతో పాటు ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, సగటు జీవిత కాలం 85 ఏళ్లు, అక్షరాస్యత 100 శాతం సాధించడం, నిరుద్యోగ రేటు 2 శాతానికి మించకుండా అభివృద్ధి చెందేలా చూస్తున్నాం.

రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం..

ప్రస్తుతం జీఎస్డీపీ రూ. 18.25 లక్షల కోట్లు ఉండగా... 2028-29 నాటికి రూ. 29.29 లక్షల కోట్లకు చేరుకోవాలనేది లక్ష్యం. ఇది సాకారం కావాలంటే 2029 కల్లా రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు రావాల్సి ఉంది.

2014-15 నాటికి వివిధ రంగాల వాటా..

2014లో రాష్ట్ర విభజనతో ఆదాయ వనరులు అన్నీ తెలంగాణకు వెళ్లాయి. కేవలం ప్రాథమికరంగంపైన మాత్రమే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ ఆధారపడాల్సి వచ్చింది. 2014లో ఏపీకి 31 శాతం ఆదాయం ప్రధానంగా వ్యవసాయ రంగం నుంచి వస్తే, తెలగాణ రాష్ట్రానికి 16 శాతం మాత్రమే ఆదాయం వచ్చింది. అలాగే పరిశ్రమల రంగం నుంచి ఏపీకి 25 శాతం, తెలంగాణకు 22 శాతం, సేవల రంగం నుంచి ఏపీకి 44 శాతం, తెలంగాణ 61 శాతం వాటా ఉంది.

2023-24 నాటికి వివిధ రంగాల వాటా..

2023-24 నాటికి ఏపీ ఆదాయంలో వ్యవసాయరంగం వాటా 34 శాతం ఉంటే, భారతదేశానికి 20 శాతం, తెలంగాణకు 15 శాతం ఉంది. ఏపీలో పరిశ్రమల రంగం వాటా 24 శాతం ఉంటే, భారతదేశంలో 26 శాతం, తెలంగాణలో 18 శాతం ఉంది. ఏపీలో సేవలరంగం వాటా 42 శాతం ఉంటే, భారతదేశంలో 54 శాతం, తెలంగాణలో 67 శాతం ఉంది.

ప్రధాన ఆదాయ వనరు లేదు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హైదరాబాద్ ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ ఆదాయం ఏపీ కోల్పోయింది. దీంతో తెలంగాణకు ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇది తెలంగాణ వృద్ధికి, తలసరి ఆదాయం పెరుగుదలకు, ఏపీ వెనకబాటు తనానికి కారణమైంది.

జీఎస్డీపీలో రాష్ట్ర సొంత ఆదాయం తక్కువ..

దేశంలోని ముఖ్యమైన రాష్ట్రాలతో పోల్చుకుంటే జీఎస్డీపీలో రాష్ట్ర సొంత ఆదాయ వనరుల శాతం ఏపీలో తక్కువగా ఉంది. ఏపీలో 6.48 శాతం ఉంటే, తెలంగాణలో 9.51 శాతం, కేరళలో 8.49 శాతం, మహారాష్ట్రలో 7.93 శాతంగా ఉంది.

విభజనతో నష్టం-పంపకాలు పెండింగ్..

విభజనతో జాతీయ సంస్థలు, విద్య-వైద్య సంస్థలు, భారత ప్రభుత్వ సంస్థలు ఏపీకి లేకుండా పోయాయి. విభజన చట్టం షెడ్యూల్ 9 ప్రకారం 91 ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లకు సంబంధించి రూ.1.63 లక్షల కోట్లు, అలాగే షెడ్యూల్ 10 కింద ఉన్న 142 సంస్థలకు చెందిన రూ.39,191 ఆస్తుల పంపకం అంశం రెండు రాష్ట్రాల మధ్య విభజన జరిగి పదేళ్లవుతున్నా ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

తలసరి ఆదాయంలోనూ తలకిందులు..

రాష్ట్రం విడిపోయే నాటికి 2014-15లో ఏపీ తలసరి ఆదాయం రూ. 93,903 ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104గా ఉండేది. మొదటి ఐదేళ్ల మా పాలనలో ఏపీలో తలసరి ఆదాయం 13.21 శాతం పెరిగి 2019కి రూ. 1,54,031కు చేరుకుంది. అదే కాలానికి తెలంగాణలో 13.37 శాతం పెరిగి రూ. 2,09,848 అయింది. 2019-24 మధ్య ఏపీలో తలసరి ఆదాయ వృద్ధి 9.18 శాతానికి పడిపోయింది. తెలంగాణలో మాత్రం 11.45 శాతం నమోదైంది. దీంతో 2023-24లో ఏపీ తలసరి ఆదాయం రూ. 2,37,951, తెలంగాణ తలసరి ఆదాయం రూ. 3,56,56 నమోదైంది. ఇలా రాష్ట్ర విభజన, గత ప్రభుత్వ విధ్వంసం కారణంగా తలసరి ఆదాయంలో తెలంగాణకు, ఏపీకి వ్యత్యాసం భారీగా పెరిగిపోయింది. దక్షిణ భారత రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయమే అత్యంత తక్కువ.

2019-24లో గాడితప్పిన వ్యవస్థ..

గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం, ఆదాయ వృద్ధిపై దృష్టి పెట్టకపోవడం రాష్ట్రానికి భారీగా నష్టం కలిగించింది. రెవెన్యూ వ్యయంపై ఎలాంటి నియంత్రణ లేదు. 2024లో అధికారం చేపట్టేనాటికి మొత్తం రుణాలు రూ.9.74 లక్షల కోట్లకు ఉంది. దీనికి తోడు గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన బకాయిలు రూ.1.35 లక్షల కోట్లు ఉన్నాయి. మూలధన వ్యయం కూడా 2014-19లో 2.01 శాతం నుంచి 2019-24కి 1.38 శాతానికి తగ్గింది.

ఈ 9 నెలల్లో గాడిలో పెట్టాం..

2024లో అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం మిగిల్చిన రూ. 24,811 కోట్ల బకాయిలు చెల్లించాల్సి వచ్చింది. కేంద్ర ప్రాయోజిక పథకాలకు సంబంధించిన బకాయిలు రూ. 13,085 కోట్లు తీర్చాం. మూలధన వ్యయానికి సంబంధించి రూ. 13,314 కోట్లు చెల్లించాం. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు రూ. 3,339 కోట్లు ఖర్చు చేశాం. అమరావతి, పోలవరం, ఇండస్ట్రియల్ హబ్, పోర్టుల నిర్మాణం కోసం నిధులు భారీగా ఖర్చు పెడుతున్నాం.

19 కొత్త పాలసీలు తీసుకువచ్చాం..

రాష్ట్రాభివృద్ధి కోసం కొత్తగా 19 పాలసీలు ప్రవేశపెట్టాం. ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎంఎస్ఎంఈ, మేరిటైమ్, క్లీన్ ఎనర్జీ, టూరిజం, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీల ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాం.

స్వర్ణాంధ్ర సాకారానికి వృద్ధి రేటే ఆధారం..

స్వర్ణాంధ్ర విజన్ -2047 సాకారం కావాలంటే వృద్ధి రేటు 15 శాతం ఉంటేనే సాధ్యమవుతుంది. 15 శాతం తగ్గకుండా వృద్ధి నమోదు చేయగలిగితే జీఎస్డీపీ రూ. 347 లక్షల కోట్లకు చేరుతుంది. తలసరి ఆదాయం రూ. 58,14,916కు పెరుగుతుంది. అదే 12.50 శాతం వృద్ధి నమోదైతే జీఎస్డీపీ రూ. 214 లక్షల కోట్లు, తలసరి ఆదాయం రూ. 35,85,473 అవుతుంది.

గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు..

రాష్ట్రాల్లో గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు కేటాయించేటప్పుడు 70 శాతం వెయిటేజీ జనాభాకు, 20 శాతం వెయిటేజీ వ్యవసాయం, అనుబంధ రంగాలకు 10 శాతం వెయిటేజీ ప్రాంతానికి ఇవ్వాలని ప్రతిపాదన. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు రూ.69,897 కోట్ల నిధులు అవసరం కాగా, రూ.7,381 కోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో రూ.62,516 కోట్ల నిధులు కావాల్సి ఉంది.

పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు..

పట్టణ, స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థల కోసం రూ. 19,871 కోట్ల గ్రాంట్లు అవసరం అవుతుంది. అలాగే 2026-2031 మధ్య కాలానికి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రూ. 16,181 కోట్లు కావాల్సి ఉంది.

ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ..

క్లీన్ ఎనర్జీకి రాష్ట్రంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలని అనుకుంటున్నాం. 2030 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం. దీనికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం ఉంది. 7.5 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని సీఎం చంద్రబాబు 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యులకు వివరించారు.

### నైనీ బొగ్గు గనిలో తవ్వకాలు
### - 13 దశాబ్దాల ‘సింగరేణి’ చరిత్రలో ఇదే మొదటిసారి...!

మొదటి పేజి తరువాయి

పరిమితమై బొగ్గు గనులు నిర్వహిస్తున్న సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగుపెట్టినట్లు అయింది. ఇదోక ఒక చరిత్రాత్మక ఘట్టంగా అధికారులు పేర్కొన్నారు. 2016 మే నెలలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సింగరేణికి కేటాయించింది. అన్ని రకాల అనుమతులు సాధించినప్పటికీ%ొా% తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్ళ సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. ఇటీవలే కాలంలో ప్రభుత్వం ఈ తవ్వకాల విషయంలో మరింత దృష్టి పెట్టడంతో లైన్ క్లియర్ అయిపోయింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అధికారులు ఒడిశా రాష్ట్రంలో ప్రత్యేకంగా పర్యటించి.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితోనూ, సంబంధిత అధికారులతోనూ సంప్రదింపులు జరిపారు. గని ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ వల్ల సింగరేణికి అతిపెద్ద బొగ్గు బ్లాక్ లభించింది. తద్వారా వార్షిక అధికోత్పత్తి సాధనకు మార్గం సుగమమై సంస్థ ఆర్థిక పటిష్టతకు దోహదపడనుంది.

**సీఎం రేవంత్ హర్షం...**

సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దాదాపు 136 ఏళ్లుగా తవ్వకాలు సాగిస్తూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న తెలంగాణ సింగరేణి రాష్ట్రం బయట ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులో తవ్వకాలు ప్రారంభించి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేసిందని పేర్కొన్నారు. సింగరేణి కోసం ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ వల్లే తొలిసారి దేశంలోని ఇతర రాష్ట్రంలోనూ బొగ్గు గనిని ప్రారంభించడం సాధ్యమైందని వ్యాఖ్యానించారు. ఇది మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఒడిశాలోని అంగుల్ జిల్లాలోని నైనీ గని ప్రారంభించడం ద్వారా సింగరేణి కొత్త శకానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు. నైనీ బొగ్గు గనులకు అన్ని అనుమతులు సాధించి అందులో తవ్వకాలు ప్రారంభించిన చారిత్రక ఘట్టం సాకారం కావడం తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణకు మణిమకుటంగా, వేలాది కార్మిక కుటుంబాలకు జీవనాధానంగా నిలుస్తున్న సింగరేణి సంస్థ అభివృద్ధికి... విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి%ొా% సింగరేణి సంస్థకు అభినందనలు తెలియజేశారు.

**కొత్త శకానికి నాంది: సీఎం రేవంత్ రెడ్డి**

ఒడిశాలోని అంగుల్ జిల్లాలోని నైనీ గని ప్రారంభించడం ద్వారా సింగరేణి కొత్త శకానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు. సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. నైనీ బ్లాకులో బొగ్గు తవ్వకాలను ప్రారంభించిన నేపథ్యంలో సింగరేణి సంస్థకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. దాదాపు 136 ఏళ్లుగా తవ్వకాలు సాగిస్తూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న తెలంగాణ సింగరేణి, రాష్ట్రం బయట ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులో తవ్వకాలు ప్రారంభించి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎంవో ట్వీట్ చేసింది. సింగరేణి కోసం ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ వల్లే తొలిసారి దేశంలోని ఇతర రాష్ట్రంలోనూ బొగ్గు గనిని ప్రారంభించడం సాధ్యమైందని, ఇది మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. నైనీ బొగ్గు గనులకు అన్ని అనుమతులు సాధించి అందులో తవ్వకాలు ప్రారంభించిన చారిత్రక ఘట్టం సాకారం కావడం తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని సీఎం పేర్కొన్నారు. తెలంగాణకు మణిమకుటంగా, వేలాది కార్మిక కుటుంబాలకు జీవనాధానంగా నిలుస్తున్న సింగరేణి సంస్థ అభివృద్ధికి, విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని అన్నారు.

**ఈ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వడం సంతృప్తినిచ్చింది.. కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**

హైదరాబాద్ : : సింగరేణి సంస్థ చరిత్రలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని, ఈ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వడం సంతృప్తినిచ్చిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఒడిశా లోని నైని బొగ్గు బ్లాక్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వర్చువల్ గా ప్రారంభించారు. దీనిపై ట్విట్టర్ వేదికగా స్పందించిన కేంద్రమంత్రి.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చొరవలో తాను భాగస్వామి అయినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన.. మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రం అవతల బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించడం సింగరేణి సంస్థ చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్రానికి వెలుపల మొట్టమొదటిసారి ఒడిషా లోని నైని బ్లాక్ లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించిందని, బొగ్గు ఉత్పత్తిని విస్తరించడం పట్ల, భారత ఇంధన లభ్యత, ఆర్థిక ప్రగతిలో నానాటికీ పెరుగుతున్న తన భాగస్వామ్యం పట్ల సింగరేణి సంస్థకు ఇది గర్విం చదగిన క్షణమని హర్షం వ్యక్తం చేశారు. నైని బొగ్గు బ్లాకులో ఉత్పత్తిని ప్రారంభించటానికి ఉన్న అవ రోధాలను తొలగించటానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం తరపున, బొగ్గు మంత్రిత్వశాఖ తరపున అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా సంస్థ అభివృద్ధిలో భాగమవ్వడం వ్యక్తిగతంగా తనకు సంతృప్తిని కలిగించిందని చెప్పారు. ఇక సింగరేణి సంస్థ తన విజయపరంపరను ఇలాగే కొనసాగించాలని, మరెన్నో మైలురాళ్లను అధిగమించాలని కోరుకుంటూ.. సింగరేణి కుటుంబానికి కిషన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కంచ గచ్చిబౌలి భూములపై
## సుప్రీంకోర్టు వ్యాఖ్యలు.. స్పందించిన కేటీఆర్

మొదటి పేజి తరువాయి

ఆయన తెలిపారు. పర్యావరణాన్ని పునరుద్ధరించాలని చెప్పిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలుపుతూ ‘ఎక్స్’ వేదికగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికైనా జ్ఞానోదయం కలుగుతుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 10 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. అనుమతి లేకుండా చెట్లు కొట్టివేసినట్లు తేలితే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లవలసి వస్తుందని తీవ్రంగా హెచ్చరించింది. చెట్లు కొట్టివేసే ముందు అనుమతి ఉందా, లేదా అనేది కీలకమని పేర్కొంది.

## ప్రమాదంలో హైదరాబాద్..
## అడుగంటిన భూగర్భ జలాలు..

మొదటి పేజి తరువాయి

వచ్చే నెలలో ఎండలు మరింత ముదిరే ప్రమాదం ఉన్నందున ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ ప్రజలు నిత్యం ఎన్నోరకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు ట్రాఫిక్ రద్దీ, అకాల వర్షాలు, వరదలు అయితే తాజాగా నగర వాసులకు మరో కష్టం వచ్చి పడింది. హైదరాబాద్ నగరంలో భూ గర్భ జలాలు అడుగంటినట్లు అధికారులు చెబుతున్నారు. గతేడాది జనవరితో పోలిస్తే.. ఈ ఏడాది జనవరిలో చాలా వరకు భూగర్భ జలాలు అడుగంటినట్లు గుర్తించారు. కూకట్‌పల్లి ప్రాంతంలో అత్యధికంగా 25.9 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు వెళ్లినట్లు అధికారులు అంచనా వేశారు. మరోవైపు కూకట్‌పల్లి జోన్‌లో భారీ భవనాల నిర్మాణం వల్ల నీటి లభ్యత తగ్గిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మే చివరినాటికి ఇక్కడ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉండే అవకాశం ఉందని భూగర్భజల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అత్యధిక ప్రాంతాల్లో గత ఏడాదికంటే భూగర్భ జలాలు గణనీయంగా తగ్గినట్లు భూగర్భ జల అధికారుల సర్వేలో తేలింది. గ్రేటర్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు వరకు 53 ప్రదేశాల్లో భూగర్భ జలాల వివరాలను తెలంగాణ ప్రభుత్వ భూగర్భజల వనరుల శాఖ విశ్లేషించింది. ఈ విశ్లేషణలో గతేడాది జనవరి కంటే ఈ ఏడాది జనవరిలో భూగర్భ జల మట్టాలు 1.33 మీటర్లు తక్కువగా ఉన్నట్లు తేలింది. గ్రేటర్ హైదరాబాద్ నగర వ్యాప్తంగా 53 ప్రాంతాల్లో విశ్లేషించగా.. 33 ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గాయి. 2024 జనవరి కంటే జలాలు అడుగంటిపోగా మరో 20 ప్రాంతాల్లో మెరుగ్గా ఉన్నట్లు వెల్లడించారు. 2024 డిసెంబరు, ఈ ఏడాది జనవరి చివరి నాటికి హైదరాబాద్ నగరంలో 0.58 మీటర్ల మేర భూగర్భ జలాలు తగ్గినట్లు గుర్తించారు. మరోవైపు ఎర్రగడ్డ, యాప్రాల్, ఫతేనగర్, దూలపల్లి, శంబీపూర్, చెంగిచెర్ల, చాంద్రాయణగుట్ట, మేడిపల్లి, హస్మత్‌పేట, గుండ్ల పోచంపల్లి, ఉప్పల్, పటాన్‌చెరు, రామచంద్రాపురం, మేడిపల్లి, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్‌లో 10 మీటర్లు కంటే ఎక్కువ లోతున భూగర్భ జలాలు పడిపోయినట్లు తెలిపారు. ప్రతీ వేసవిలో బోర్లు ఎండిపోతుండటం వల్ల నీటి కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని నగర ప్రజలు వాపోతున్నారు.

## గుజరాత్ నుంచే
## మార్పు మొదలు : రాహుల్ గాంధీ

మొదటి పేజి తరువాయి



రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో పార్టీ వ్యూహాన్ని కూడా ఆయన వెల్లడించారు. గుజరాత్‌లో పార్టీ నైతిక స్థైర్యం దెబ్బతిన్నా.. భాజపాను ఓడించగలమని దీమా వ్యక్తం చేశారు. మార్పు గుజరాత్ నుంచే మొదలవుతుందని అభివర్ణించారు. పార్టీ అంతర్గత సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రంలో కొత్త నాయకత్వం వస్తుందని పేర్కొన్నారు. ఈ అంశంపై పార్టీ అధ్యక్షుడు ఖర్గే సహా సీనియర్లు మొత్తం కొన్ని నెలల నుంచి చర్చిస్తున్నట్లు వెల్లడించారు. “ప్రస్తుతం జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయం మాత్రమే కాదు. ఇది భావజాలానికి కూడా సంబంధించింది. భాజపా, ఆర్ఎస్ఎస్‌ను ఓడించగలిగేది కేవలం కాంగ్రెస్ పార్టీనే అని ప్రజలకు తెలుసు” అని రాహుల్ వ్యాఖ్యానించారు. పార్టీలోనే నాయకుల మధ్య నెలకొన్న వర్గపోరు, స్థానిక నాయకులకు టికెట్లు రాకుండా చేయడం వంటివి ఆందోళనకరమన్నారు. పార్టీలో మార్పులు తీసుకురావడం అవసరమని తాము భావిస్తున్నట్లు రాహుల్ వెల్లడించారు. తాను జిల్లా నాయకులతో మాట్లాడినట్లు చెప్పారు.

**నాయకత్వం అలా ఉండాలి..**

ఇక పార్టీ నాయకత్వ పాత్ర ఎలా ఉండాలో రాహుల్ వివరించారు. “రెండు రకాల హీరోలు ఉంటారు. ఒకరు పోటీలకు.. మరొకరు పెళ్లిళ్లకు. కాంగ్రెస్ పార్టీ పెళ్లి హీరోలను రేసులకు.. రేసుల హీరోలను పెళ్లిళ్లకు పంపుతోందని చాలా మంది నాతో చెప్పారు. ఈ హీరోలను గుర్తించి ముందు వేరుచేయాలి. జిల్లాల్లో పార్టీని స్థానికంగానే నడిపించాలి. ఆర్గనైజేషన్‌కు.. అభ్యర్థులకు మధ్య బలమైన సంబంధాలుండేట్లు చూసుకోవాలి” అని రాహుల్ పేర్కొన్నారు.

**నాడు ఆర్టికల్ 370 రద్దుకు మద్దతిచ్చిన ఫరూక్ అబ్దుల్లా: ‘రా’ చీఫ్ సంచలన ఆరోపణలు**

ఎవరికి తగిన పాత్ర వారికి కేటాయించాలని ఆయన నొక్కిచెప్పారు. అహ్మదాబాద్ నుంచి సీనియర్ నాయకులు వచ్చినప్పుడు కొందరు హడావుడి చేసి ఆ తర్వాత జాడ లేకుండా పోతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభియోగపత్రం నమోదు చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ సమయంలో రాహుల్ గుజరాత్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకొంది.

భారత్ BHARATH REPORTER



## చిన్నంబావి మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి


### కొప్పునూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రబ్బీ సీజన్ వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం




చిన్నంబావి మండలం (భారత్ రిపోర్టర్ ):చిన్నంబావి మండల పరిధిలోని వెల్టూర్ గ్రామం, అమ్మాయిపల్లి గ్రామాలలో కొప్పునూర్ సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. వారితో పాటు కొప్పునూర్ సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహా రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెబ్బేటి రామచంద్రారెడ్డి జంగ విష్ణుపల్లి యాదవ్ మండలి చిదంబర్ రెడ్డి గజ్జ ఈదన్న యాదవ్ పాల్గొన్నారు.రబ్బీ సీజన్ లో రైతులు పండించిన నాణ్యత ప్రమాణాలు కలిగిన ప్రతి గింజా కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు సన్న రకం వడ్లకు 500 రూపాయలు బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుంది అన్నారు. గ్రామాలలోని రైతులు వరి కొనుగోలు కేంద్రాలు ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండలం రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు తేజా రెడ్డి సింగిల్ విండో డైరెక్టర్లు శ్రీకాంత్ రెడ్డి వెంకటస్వామి మద్దిలేటి నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డెమాన్ బిచ్చన్న మండలి కృష్ణ రామస్వామి రాజారెడ్డి మోహన్ రెడ్డి ప్రభు గౌడ్ బందారు స్వామి డబ్బ నరసింహ పార్థసారథి గౌడ్ చిన్నయ్య గౌడ్ ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.సింగిల్ విండో ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగరాజు సిబ్బంది కార్యవర్గ సభ్యులు ఉన్నారు.



## కొప్పునూరు గ్రామంలో పళ్ళు వివాహ వేడుకలలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ జంగా బిచుపల్లి యాదవ్



చిన్నంబావి మండలం (భారత్ రిపోర్టర్ ):చిన్నంబావి మండల కొప్పునూర్ గ్రామానికి చెందిన బడికెల కళావతి వెంకటస్వామి దంపతుల ఆహ్వానం మరియు మేరకు ఇదే గ్రామానికి చెందిన కత్తి దేవమ్మ భగవంతు



దంపతుల ఆహ్వానం మేరకు,వారి ఇంటి దగ్గర జరిగిన వారి కుమారుడు బాలకృష్ణ మల్లేశ్వరి ల వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించిన చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగ బీచుపల్లి యాదవ్ వీరి వెంట పెద్దరాజు బిచ్చన్న తగరం పెద్ద లక్ష్మయ్య బడికెల బాలరాజు తగరం నాని పసుల భారత్ అశోక్ రెడ్డి పసుల మధు బన్నురు శివ కంది శివ బడికెల చంద్రయ్య జగదీష్ తగరం దయ్యం రాజు తదితరులు ఆశీర్వదించారు.

## ఒక్కొక్కరికి వందరోజుల పని కల్పించాలి కొలతలు లేకుండానే ఉపాధి పనిని చేపట్టి రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్



చిన్నంబావి మండలం (భారత్ రిపోర్టర్):బెక్కెం గ్రామ పంచాయితీ ముందు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు నాలుగు వారాల నుంచి పనిచేస్తున్న కూలీ డబ్బులు రానందుకు నిరసన తెలియజేస్తూ ధర్నా చేశారు.బెక్కెం గ్రామ పంచాయితీలో మార్చి నెల ప్రారంభం నుంచి జాతీయ గ్రామీణ హామీ పథకం కింద ఉపాధి పనులు చేసిన కూలీలకు నేటికీ కూలీ డబ్బులు రాలేదు. గతం మాదిరిగా కూలీలకు పని ముట్లకు డబ్బులు ఇవ్వకుండా బంద్ చేయడం ఉపాధి హామీ చట్టం విధానానికి విరుద్ధమైనదిగా కేంద్ర ప్రభుత్వం చేస్తా ఉంది.ఈ గ్రామంలో కేవలం దళిత, గిరిజన భూముల్లో లెవలింగ్ పనులకే పరిమితం పెట్టడం మూలంగా కూలీల సంఖ్యకు అనుగుణంగా పని లేకపోవడం జరుగుతుంది దళిత గిరిజనుల భూముల్లో పాటు బీసీ,ఓసి ఇతర రైతుల భూముల్లోనే ఉపాధి కింద పనులు పెట్టి కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది.కేంద్ర ప్రభుత్వం జిఎస్టీ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు ధరలను నూటికి ఆరు శాతం చొప్పున ధరలు పెంచింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు 600 రూపాయలకు కూలి పెంచాలని, ప్రతి కుటుంబానికి నేటికి వందరోజుల పని మాత్రమే ఉంది. కుటుంబ సభ్యుల సంఖ్య పెరగడం, వ్యవసాయంలో యంత్రాలు రావడం వలన ఆ కుటుంబాలకు వందరోజుల పని సరిపోవడం లేదు. కాబట్టి ప్రతి వ్యవసాయ కూలీకి అనగా ఒక్కొక్కరికి వందరోజుల పని కల్పించాలని కొలతలు లేకుండానే ఉపాధి పనిని చేపట్టి రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బెక్కెం గ్రామపంచాయితీ కార్యాలయం ముందు ధర్నా చేసి గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీ గోపాల్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్ రెడ్డి



చిన్నంబావి మండలం (భారత్ రిపోర్టర్):చిన్నంబావి మండలం పెద్ద మారూర్ గ్రామానికి చెందిన జక్కుల లక్ష్మి, జక్కుల శ్రీకృష్ణ యాదవ్ దంపతుల ఆహ్వానం మేరకు వారి కుమారుడు, బాలరాజు యాదవ్,మాధవి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్ రెడ్డి ఎస్. శ్రీనివాసులు జగ్గారి భగవంత రెడ్డి రిటైర్డ్ ఆర్మీ మహబూబ్ బాషా బొల్లెద్దుల నాగశేషులు కే సుధాకర్ ఆటో నరేష్ ఆటో వెంకటేష్ బొల్లెద్దుల సురేష్ పి రామకృష్ణ గొల్ల హనుమయ్య కార్తీక్ రెడ్డి శ్రీకృష్ణ యాదవ్ యాసిన్ భాష తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య విద్యా సంస్థల ఆగడాలను అరికట్టండి - రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మరియు కమిషనర్ కు ఫిర్యాదు




హిందూపురం, (భారత్ రిపోర్టర్)విద్యారంగాన్ని వ్యాపార వేదికగా మార్చుకొని విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రముఖ సామాజిక కార్యకర్త మకాన్దార్ ఇమ్రాన్ అలీ ఖాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు విద్యాశాఖ కమిషనర్ విజయ రామ రాజుకు ఫిర్యాదు చేశారు. డిజిటల్ కంటెంట్ ఫీజు పేరుతో విద్యార్థుల నుండి దాదాపు రూ.57 కోట్ల రూపాయలు ఫీజు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉచితంగా లభించే డిజిటల్ వనరులు ఉన్నప్పటికీ, ఇలా నిర్బంధంగా ఫీజులు వసూలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు మరియు యూనిఫాంలు తప్పనిసరిగా సంస్థ నుంచే కొనుగోలు చేయాలని యాజమాన్యం నిబంధన విధించి, మార్కెట్ ధరల కంటే రెట్టింపు ధరలకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటి విలువ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.300 కోట్లు ఉంటుందని తెలిపారు. టాలెంట్ సెర్చ్, ఒలంపియాడ్, గేమ్స్ పేరిట పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్న సంస్థ కేవలం కొద్ది మందికే బహుమతులు ఇచ్చి మిగిలిన సొమ్ము స్వాహా చేస్తుందని దీనిపై ఆడిట్ చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. రూ.1,000 కోట్ల స్కాలర్ షిప్ ఇస్తామంటూ ప్రకటనలు చేసిన సంస్థ, వాస్తవానికి ఎంతమందికి లబ్ధి చేకూర్చిందన్న విషయంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. శ్రీ చైతన్య పాఠశాలలలో ఫీజుల వివరాల పట్టికలు ప్రదర్శించకపోవడం, కొన్నిచోట్ల ఒకే అనుమతితో రెండు పాఠశాలలు నడుపుతున్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, విద్యార్థుల హక్కులను కాపాడేందుకు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించేందుకు, ప్రభుత్వం వెంటనే స్పందించి, తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను కార్మికులుగా గుర్తించాలి

### వనపర్తి జిల్లా మాజీ యువ మోర్చా అధ్యక్షులు మోహన్ యాదవ్



చిన్నంబావి మండలం (భారత్ రిపోర్టర్): ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పై వనపర్తి జిల్లా మాజీ యువ మోర్చా అధ్యక్షులు మోహన్ యాదవ్ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం లో స్వయంగా ముఖ్యమంత్రి విద్యా శాఖను పర్యవేక్షిస్తున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల వ్యాపారమే ధ్యేయంగా కనీసం మానవతా విలువలు లేకుండా ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తుంది.విద్యను వ్యాపారం చేస్తూ ఉపాధ్యాయులకు పని గ%%లు పెంచి ఇతర పనులను విధుల్లో చేర్చి ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు తెలుస్తుంది. ముఖ్యంగా కొన్ని యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ల పేరుతో ప్రైవేటు ఉపాధ్యాయులను సేల్స్ మెన్ గా చేస్తూ ఇంటింటి ప్రచారానికి విద్యార్థుల సంఖ్య పెంచాలని హుకుం జారీ చేస్తున్నారని కొన్ని పాఠశాలల్లో ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా అడ్మిషన్ల పేరుతో టార్గెట్లు ఇచ్చి ఇబ్బందులు గురి చేస్తున్న పోద్దం చూస్తున్న అధికారులు.కేవలం ఓట్లకు మాత్రమే ప్రైవేట్ ఉపాధ్యాయులను వాడుకుంటున్నారని సమస్యల పైన ఒక సంఘం గాని ప్రభుత్వంగాని లేకపోవడంతోటే కొన్ని యాజమాన్యాలు ఇష్టా రీతిగా వ్యవహరిస్తున్నట్లు ఆవేదన చెందు తున్నారు.ప్రైవేటు ఉపాధ్యాయ సమస్యలపై ఏ సంఘం నాయకులు మాట్లాడటంలో కనిపించడం లేదు.వేసవి సెలవుల్లో పూర్తి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని ధైర్యం చేసి ఎవరైనా ప్రశ్నిస్తే ఉంటే ఉండండి లేకపోతే వెళ్ళిపోవని భయ భ్రాంతులకు గురిచేస్తున్నారు. దాదాపు తెలంగాణ రాష్ట్రంలో 3 లక్షల పైగా ప్రైవేట్ టీచర్లు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 90% పైగా మంది విద్యార్థుల భవిష్యత్తు మార్చే బాధ్యత ఉంది.ప్రైవేట్ టీచర్ల ఉద్యోగ భద్రత గాలి లో దీపం లాంటిది. విద్యార్థులకు ఉపాధ్యాయులకు సరైన వసతులు కల్పించడంలో యాజమాన్యాలు విఫలమవుతున్నాయి.అనేక సందర్భాలలో అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలిపిన ప్రయోజనం లేదని వారిని కార్మికులుగా గుర్తించాలని పిఎఫ్, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారుల ఆదేశాలు, విద్యా హక్కు చట్టాన్ని అమలు చెయ్యని యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని యువమోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు మోహన్ యాదవ్ కోరారు

## నేషనల్ హెరాల్డ్ పత్రిక వివాదంలో అక్రమంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై ఛార్జ్ షీట్ దాఖలు చేయడంపై నిరసిస్తూ ధర్నా.



ములుగు ప్రతినిధి (భారత్ రిపోర్టర్)ములుగు జిల్లా కేంద్రంలో టీపీసీసీ పిలుపుమేరకుమంత్రి సీతక్క ఆదేశాలతో మండల అధ్యక్షులు ఎండి.ఆధ్వర్యంలో నేషనల్ హెరాల్డ్ పత్రిక యొక్క అక్రమ కేసు యొక్క ఛార్జ్ షీట్ల్ కావాలని ఏఐసీసీ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇరికించి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసిన బీజేపీ పార్టీ యొక్క తీరుపై నిరసన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పాల్గొని మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం కావాలని మా అగ్ర నాయకులైన సోనియా గాంధీ రాహుల్ గాంధీ పై కక్ష్య పూరిత చర్యలు జరుపుతూ ప్రజా స్వామ్యాన్ని ఖూని చేస్తూ నేషనల్ హెరాల్డ్ పత్రిక వివాదం యొక్క ఛార్జ్ షీట్ లో అక్రమంగా పేర్లు జరిపించడం దారుణమని అంటూ, వెంటనే ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారుగత పార్లమెంట్ ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఎంతో ప్రతిష్టాత్మకంగా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన పాదయాత్ర ప్రజలకు చేరువ చేసిందని, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 400 పార్లమెంట్ సీట్లు గెలుచుకుంటామని బీజేపీ పార్టీ పూర్తి మెజారిటీ లేకుండా ఉండటానికి కారణం అయిన ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల పొత్తు పెట్టుకుని అధికారం చేపట్టిందని, దానికి ఒకే ఒక్క కారణం రాహుల్ గాంధీ పాదయాత్ర అని, వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే భయంతో ఎప్పుడో ముగిసిన నేషనల్ హెరాల్డ్ పత్రిక వివాదం కేసు యొక్క ఛార్జ్ షీట్ లో రాహుల్ గాంధీ సోనియా గాంధీ పేర్లు ఇరికించడం దారుణమని, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ పార్టీ ఖూని చేస్తుంది అని ఆరోపిస్తూ బీజేపీ పార్టీ మతం పార్టీలో రాజకీయం చేస్తున్నదని, మానవత్వాన్ని మరిచి అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, టీపీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్ జిల్లా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు మహిళా కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 18న జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికలకు షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికలు నిర్వహించబడును

### రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి గోపాల్



మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి (భారత్ రిపోర్టర్): తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్. బలయ్య ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 18న శుక్రవారం ఉదయం 10 గంటలకు మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్లో నారాయణపేట జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికలకు షూటింగ్ బాల్ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం, జిల్లాఅధ్యక్షుడు సత్య ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పిఈటి రమేష్ కుమార్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. నారాయణపేట జిల్లాలోని 2008 తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని ,వారు బోనఫైడ్, ఆధార్ కార్డుతో ఎంపికలలో పాల్గొనాలని కార్యదర్శి రమేష్ తెలిపారు. అలాగే మహబూబ్నగర్ జిల్లా, వనపర్తి జిల్లా క్రీడాకారులకు షూటింగ్ బాల్ ఎంపికలను మక్తల్ లోనే నిర్వహించి ఎంపిక చేస్తామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం తెలిపారు. ఆసక్తిగల బాలబాలికలు ఏప్రిల్ 18న మక్తల్ స్టేడియం గ్రౌండ్లో రిపోర్టు చేయాలని ఆయన తెలిపారు .ఈ ఎంపికలలో క్రీడా ప్రతిభను చాటిన బాలబాలికలను ఎంపిక చేసి ,ఏప్రిల్ 25 నుండి 27 వరకు నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం, బిజ్వార్ గ్రామంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని వారు తెలిపారు. మిగతా వివరాలకు 77 02 71 31 39, 9666745851.ను సంప్రదించగలరు.

## భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఎత్తివేసే కుట్రలను ప్రభుత్వం విరమించుకోవాలి ఏఐటీయూసీ




ములుగు ప్రతినిధి (భారత్ రిపోర్టర్)ములుగు జిల్లాలోనిఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం ములుగు జిల్లా ద్వితీయ మహాసభ కా,,పి కొండయ్య అధ్యక్షతన ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనములో జరిగినఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ,భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఎత్తివేసే కుట్రలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు అనేక పోరాటాల ఫలితంగా భవననిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు జరిగిందని అన్నారు దాని ద్వారా బోర్డు లో సభ్యత్వం పొందిన కార్మికులకు పరిహారాలు అతి తక్కువగా ఉన్నాయి అలాగే సహజ మరణానికి ఒక రకం,ప్రమాద మరణాలకు మరో రకంగా పరిహారాలు చెల్లిస్తున్నారు ఇది అన్యాయం అన్నారు మరణాలు ఎలా జరిగినా మనిషి కనిపించడు కాబట్టి ఎలాంటి మరణం సంభవించినా 10.లక్షలు చెల్లించాలని అలాగే వివాహాలకు,ప్రసూతికి 1.5 లక్షల రూపాయలు అంగవైకల్యానికి 6 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు భవన నిర్మాణ కార్మికులకు రోగనిర్ధారణ పరీక్షల పేరుతో కోట్లాది రూపాయలు ప్రైవేట్ సంస్థలకు దోచిపెట్టే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు దాని మూలంగా సంక్షేమ బోర్డు లోని డబ్బులు దుర్వినియోగం అవడమే కాకుండా ఆ పరీక్షల వలన కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదు అన్నారు అనంతరం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది .భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గా పోలం కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా కొక్కుల రాజేందర్లతో పాటుగా మొత్తం తొమ్మిది మంది తో ఎన్నుకోవడం జరిగినదిఈ సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కార్యదర్శి బండి నర్సయ్య, జిల్లా కోశాధికారి శ్యామల దేవేందర్, సిపిఐ ములుగు మండలం కార్యదర్శి ముత్యాల రాజు,జక్కుల అయిలయ్య,శ్యాంసుందర్జంగం కొమురయ్య, సర్వేశ్వరరావు,కంగల రామయ్య, అజయ్, దేవేందర్, మల్లమ్మ,కొయ్యడ లక్ష్మి, పద్మ,స్వరూప,రవి, దేవేందర్,మల్లు, తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపి క పారదర్శకంగా చేయాలి. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.



నారాయణపేట జిల్లా ప్రతినిధి,భార త్ రిపోర్టర్:- ఇందిరమ్మ ఇండ్ల లబ్ది దారుల ఎంపిక జిల్లాలోపారదర్శకం గా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా ప ట్నాయక్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తుల ను క్షేత్రస్థాయిలో పరిశీలించి,అర్హత కలి గిన వారినే ఎంపిక చేయాలన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని స మావేశ మందిరం లో ఇందిరమ్మ ఇళ్ల యాక్షన్ ప్లాన్ పై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని, గత జనవరి 26 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోస్గి మండ లం చంద్ర వంచ గ్రామంలో ఇంది రమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించార ని, అలాగే ఫిబ్రవరి 21 న నారాయ ణపేట మండలంలోని అప్పక్ పల్లి గ్రామంలో ఓ లబ్ధిదారు రాలికి మం జూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణా నికి ముఖ్యమంత్రి భూమి పూజ చే శారని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.మండలంలోఒకగ్రామాన్ని ఎంపిక చేసి ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిందని,ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారికి బుధవారం సాయంత్రంవరకుమొ దటి విడత రూ. లక్ష వారి ఖాతాలో జమ అవుతుంద నే సమాచారం వ చ్చిందని కలెక్టర్ తెలిపారు. అలాగే నియోజకవర్గానికి ప్రభుత్వం కేటా యించిన 3500 ఇండ్ల కోసం అర్హత కలిగిన వారి నే ఎంపిక చేయాలని, జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ లో చిన్న పొరపాటు జరిగిందని వీ లులేదని ఆమె తేల్చి చెప్పారు. ద రఖాస్తు చేసుకున్న వారి వద్దకు వెళ్లి ప్రస్తుతం వాళ్ళు ఉంటున్న ఇంటిని, పై కప్పును పరిశీలించినతర్వాతే ప్ర భుత్వ నిబంధనల మేర కు ఎంపిక చేయాలని ఆమె ఆదేశించారు. హై దరాబాద్, లేదా వేరే ప్రాంతా ల్లో నివాసం ఉంటున్న వారిని ఎంపిక చేయ వద్దన్నారు.ఎల్ఐజీ విత్ ల్యాండ్ ప్రకారమే ఎంపిక ఉండా లన్నారు.ఇందిరమ్మ కమిటీల ద్వారా ఈ నెల 21 వర కు దరఖాస్తుల జా బితా ఎంపీడీవోలకు చేరుతుందని, ఈ నెల30వరకు ఇచ్చిన కోటాకు క్షే త్రస్థాయిలో సర్వే చేసి ఎంపికచేయా లని ఆమె సూచించారు. మే 2న గ్రా మ పంచాయితీ కార్యాలయం వద్ద అర్హుల జాబితా ప్రదర్శించడం జరు గుతుందని తెలిపారు. అధికారులు ఎవరో ఫోన్ చేశారని,ఇతరులెవరు ప త్రకారి కి ఎంపిక చేసినా గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు వస్తాయని, ఈ విషయం దృష్టిలో పెట్టుకొని అ ర్హుల ఎంపిక పగడ్బందీగా, పారద ర్శకంగా చేయాలని కలెక్టర్ సూచిం చారు.అలాగే ఈ నడి వేసవి కాలం లో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమ స్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆమె అధికా రులను ఆదేశించారు.ఈకార్యక్రమం లో స్థానిక సంస్థల జిల్లా అదనపు క లెక్టర్ సంచిత్ గంగ్వార్ హౌసింగ్ పీడీ శంకర్, అన్ని మండలాల ప్రత్యేక అ ధికారులు,ఎం పీ డీ వో లు,ఎంపీవో లు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్ డ బ్ల్యుఎస్, ఇరిగేషన్,హౌసింగ్ ఏ ఈ లు పాల్గొన్నారు.



## సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన...



పోలవరం,ఏప్రియల్ 16 (భారత్ రిపోర్టర్)రాష్ట్ర కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల సామాన్యులపై భారాలు మోపడం దుర్మార్గకరమని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బుధవారం మండలం లోని పోలవరం విద్యుత్ ఉప కేంద్రంవద్ద సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఎన్నికల హామీలు అమలు చేయాలనీ, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, విద్యుత్ ఛార్జీలు పెంచొద్దని నినాదాలు చేశారు.నిరసనను ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచనని, నాణ్యమైన కరెంట్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10నెలలు నెలల కాలంలో ఇష్టారాజ్యంగా కరెంట్ ఛార్జీలు పెంచడం బాధాకరం అన్నారు.దసరపాలుగా విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులు,చిరు వ్యాపార,పరిశ్రమలపై భారాలు మోపడం ఈ కూటమి ప్రభుత్వంకు సబబు కాదన్నారు.ట్రూ అప్ ఛార్జీలు,సర్ ఛార్జీలు,ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు అంటూ ధరలు పెంచడం కూటమి ప్రభుత్వంకు తగదన్నారు.విద్యుత్ భారాలతో పాటు స్మార్ట్ మీటర్లు బిగింపు మరింత అందగారంలోకి నెట్టివేస్తున్నదన్నారు.అదానితో గత ప్రభుత్వం కుదుర్చుకున్న సెకి ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.వేసవి దృష్టిలో ఉంచుకొని విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని అన్నారు.ప్రభుత్వం ఇష్టా రాజ్యంగా విద్యుత్ ఛార్జీలు పెంచితే మళ్ళీ విద్యుత్ ఉద్యమం పునరావృతం అవుతుందని హెచ్చరించారు.అనంతరం ప్రభుత్వ హామీని అమలు చేయాలని కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు బొరగం భూచంద్రరావు, మడివి చలపతి రావు,గోకూరి పాండవులు, తదితరులు పాల్గొన్నారు..

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన రేవల్లి నూతన ఎస్సై వి. రజిత.




వనపర్తి జిల్లా ప్రతినిధి (భారత్ రిపోర్టర్): బుధవారం రోజు రేవల్లి నూతన ఎస్సై, వి. రజిత. రావుల గిరిధర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రజిత. జోగులాంబ గద్వాల్ జిల్లా టీటీఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ రేవల్లి కి బదిలీపై వచ్చారు.రేవల్లిలో ఎస్సైగా పనిచేసిన రాము వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తూ ఆమె ప్రజలను కోరారు.

భారత్ RNI.APTEL/16364/2023 జాతీయ తెలుగు దినపత్రిక BHARATH REPORTER రిపోర్టర్



## సంగం బండ పిఎసిఎస్ లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ రాధాలక్ష్మారెడ్డి



మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి (భారత్ రిపోర్టర్): నారాయణపేట జిల్లా మక్తల్ మండలం సంగంబండ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభంచేసిన మార్కెట్ కమిటి ఛైర్మెన్ గవినోళ్ల రాధా లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా రైతులకు దిశా నిర్దేశం చేస్తూ రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం క్వింటాలుకు 2320 చెల్లిస్తున్నట్లు తెలిపారు అదనంగా 500 రూపాయల బోనస్ ఇస్తుందన్నారు కొనుగోలు చేసే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చుసుకోవాల్సిందిగా పిఎసిఎస్ సభ్యులకు సూచించారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ రాములు, డైరెక్టర్ మహదేవప్ప, మాజీ ఎంపిటిసి బలరాం రెడ్డి, అనంతరెడ్డి, చిన్నారెడ్డి, బలరాం రెడ్డి, సంతోష్ రెడ్డి రవీందర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు

## వాల్ రైటింగ్ రాసిన చిట్టెం ఉత్సాహంగా పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు




మక్తల్ నియోజకవర్గం ప్రతినిధి (భారత్ రిపోర్టర్):వరంగల్ లో ఏప్రిల్ 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ముమ్మరంగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మక్తల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచార హోరు కొనసాగుతోంది. మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు, అమరచింత మున్సిపాలిటీ, నర్వ, కృష్ణా, మాగనూర్ మండల కేంద్రాల్లో వాల్ రైటింగ్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి.బుధవారం మక్తల్ పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి స్వయంగా గోడలపై వాల్ రైటింగ్ చేసికార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు పి నరసింహ గౌడ్, రాజేష్ గౌడ్,కొత్త శ్రీనివాస్ గుప్తా,మాగనూరు మండలం పార్టీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మక్తల్ పట్టణ పార్టీ అధ్యక్షులు హనుమంతు, జుట్ల శంకర్, బండారి ఆనంద్, జుట్ల సాగర్ నరసింహారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ "బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని వరంగల్ లో నిర్వహిస్తున్న రజతోత్సవ సభను జయప్రదం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి. మక్తల్ నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలి"అనిపిలుపునిచ్చారు.

## నూతన చట్టంలో మరో 14 అంశాల తో భూభారతి పోర్టల్.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.




ములుగు ప్రతినిధి (భారత్ రిపోర్టర్)రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్ కు గతంలోని ధరణి పోర్టల్ కు చాలా తేడా ఉందని, భూముల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగవద్దని ఉద్దేశంతో ప్రభుత్వం మరో 14 అంశాలను పొందుపరిచిందని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టం, దాని పద్ధతులు అనే రెండు అంశాలను ప్రభుత్వం ఆధారంగా తీసుకొని భూమాతను ఏర్పాటు చేయడం జరిగిందని, భూముల విషయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడిన సంవత్సర కాలంలో పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పించిందని వివరించారు. భూ సమస్యలపై గతంలో కోర్టులను ఆశ్రయించే వారని నేడు కోర్టులను ఆశ్రయించకుండానే షెడ్యూల్ (ఏ) ను ఏర్పాటు చేసి భూమి విలువ 5 లక్షల లోపు ఉన్నపక్షంలో ఆర్డీవో స్థాయి, 5 లక్షలకు పైగా ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం కల్పించారని తెలిపారు. భూమి విషయంలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆరోజు నుండి సంవత్సరకాలం లోపు సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, కలెక్టర్ స్థాయిలో సమస్య పరిష్కారం కాని పక్షంలో సీసీఎల్ఏ కు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ బోర్డు భూములను ఎవరైనా ఆక్రమించి పట్టాలు చేసుకున్న పక్షంలో కేసులను నమోదు చేయడం జరుగుతుందని, గుడ్డిగా రిజిస్ట్రేషన్ చేసే అవకాశాలు ఏ మాత్రం ఉండవని అన్నారు. ప్రస్తుతం మండల తహసీల్దార్లు, సబ్ రిజిస్టర్ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారని, ఇకనుండి చేసే రిజిస్ట్రేషన్ లను అన్ని పరిశీలించిన అనంతరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగిస్తారని తెలిపారు. జిల్లాలో వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఆ మండలంలోని అన్ని గ్రామాలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని, మే ఒకటి నుండి 31 వరకు పరిశీలన చేసిన అనంతరం జూన్ 2వ తేదీన పట్టాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా లోని మిగతా మండల కేంద్రాల్లో అవగహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఒక గ్రామ పరిధిలోని భూముల వివరాలు పూర్తిగా తహసిల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్, ఖజానా కార్యాలయంలో పొందుపరచడం జరుగుతుందని, జమాబంధు తరహాలో భూభారతిపోర్టల్ కొనసాగుతుందని అన్నారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

## కర్ణ వేదిక మహోత్సవ పంచెకట్టు. కార్యక్రమానికి హాజరైన మాజీ జడ్పీ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బడేనాగు జ్యోతి



ములుగు ప్రతినిధి (భారత్ రిపోర్టర్)ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని బాలాజీ నగర్ గ్రామానికి చెందిన భూక్యలత–దేవేందర్ కూతురు అశ్విత కర్ణ వేదిక మహోత్సవం కుమారుడు వరుణ్ తేజ్ పంచె కట్టు వేడుకకు హాజరైన మాజీ జడ్పీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి పాల్గొని ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లాకావత్ నరసింహ నాయక్, గ్రామ అధ్యక్షుడు మలోత్ గాంధీ, పోరిక స్వామి, భూక్య సేవ నాయక్ అజ్మీర లక్ష్మన్న భూక్య దేవ్ వాంకుడోత్ రాజు, ప్రతాప్ భూక్య మీటు అజ్మీర నరసింహ భూక్య జగన్ మాలోత్ గాంధీ జాటోత్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు,

## మంత్రి పర్యటన ఏర్పాట్లను పర్య వేక్షించిన కలెక్టర్.



నారాయణపేట జిల్లా ప్రతినిధి,భార త్ రిపోర్టర్:–భూభారతి పోర్టల్ పై ప్ర జలకు అవగాహన కల్పించేందు కు పైలెట్ ప్రాజెక్టుకింద ఎంపికైనమద్దూ రు మండలంలోని ఖాజీపూర్లో గు రువారం నిర్వహించే భూ భారతి రె వెన్యూ సదస్సు కు హాజరవు తున్న రెవెన్యూ, సమాచార పౌరా సంబం ధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి ముఖ్య అతిథిగాహాజరవుతు న్నందున ఖాజీపూర్ లో బుధవారం మంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా క లెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించా రు. గ్రామంలో ని రెండు స్థలాల నుచూసిన కలెక్టర్ మండలపరిషత్ పా ఠశాల ఎదురుగా ఉన్న స్థలంలోభూ భారతి రెవెన్యూ సదస్సు కు ఏర్పా టు చేయాలని అధికారుల కు సూ చించారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానం లో భూ భారతి పోర్టల్ ను అందుబాటులో కి తీసుకువచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగ ల్ నియోజకవర్గం లోని మద్దూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎం పిక చేయగా గురువారం రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరె డ్డి భూ భారతిసదస్సును మండలం లోని ఖాజీపూర్ లో



ప్రారంభించను న్నారు. అందుకోసం ఖాజీపూర్ లో ఏర్పాట్ల ను కలెక్టర్ దగ్గ రుండి పరిశీలించారు. మంత్రి చే ప్రారంభించేభూ భారతి సదస్సుకు అన్ని ఏర్పా ట్లను పూర్తిచేయాలని కలెక్టర్అధికా రులను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బే న్ షాలొమ్, ఆర్డిఓ రామచందర్ నా యక్, మద్దూర్ తహసిల్దార్ మహేష్ గౌడ్, రెవెన్యూ అధికారులు పాల్గొ న్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తని ఖీ చేసిన కలెక్టర్.




నారాయణపేట జిల్లా ప్రతినిధి,భార త్ రిపోర్టర్:– మద్దూర్ మండల కేం ద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రా న్ని బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా ప ట్నాయక్ తనిఖీ చేశారు.ధాన్యం కొ నుగోలు కేంద్రం లో సౌకర్యాలు పరి శీలించారు.ధాన్యం కొనుగోలుప్రారం భమైనప్పటి నుంచి ఇంత వరకు ఎ న్ని క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారని నిర్వాహకులను ఆమె అడి గి తెలుసుకున్నారు. ధాన్యంకొనుగో లు కేంద్రం లో తేమ కొలిచే యంత్రం తో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిం చారు. నిర్ణీత తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసికొను గోలు చేయాలని ఆమె ఆదేశించారుకొను గోలు చేసిన ధాన్యం ను ట్యాగ్ చేసిన మిల్లుకురవాణాచేయాలన్నా రు.ధాన్యం కొనుగోలు కేంద్రం కు వ చ్చిన ధాన్యం తేమ శాతం పరిశీలిం చి రైతుల కు వ్యవసాయ అధికారు లు టోకెన్లు జారీ చేయాలన్నారు.ధా న్యం కొనుగోలు కేంద్రం కు తూర్పార పట్టి, ఆర పోసి,తాలు,మట్టి లేని నా ణ్యత ప్రమణాల ప్రకారం ధాన్యం కొ నుగోలు కేంద్రాని కి తీసుకు వచ్చి ప్ర భుత్వ మద్దతు ధర పొందాలని సూ చించారు. అకాల వర్షాలు కురుస్తు



న్న%శీ%దున రైతులు ధాన్యంతడవకుం డా తగు జాగ్రత్తలుతీసుకోవాలని అ న్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రం లో ధాన్యం శుభ్రం చేయుటకు ప్యాడీ క్లీ నర్, టార్పా లిన్ లు సిద్ధంగాఉంచా లని సూచించారు. అనంతరం కలెక్ట ర్ పల్లె గడ్డ గ్రామంలో ఏర్పాటు చేసి న ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని త నిఖీ చేసి అక్కడి నిర్వాహకులకు వ రి కొను గోలుకు సంబంధించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు.కలె క్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలొమ్,తహసిల్దార్, రెవెన్యూ సింగిల్ విండోఅధికారులు పాల్గొన్నా రు.

## అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ నాయకులు.



ములుగు జిల్లా (భారత్ రిపోర్టర్):ఏటూరునాగారం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ములుగు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్, ములుగు గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారుఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న,మండల అధ్యక్షులు చిటమట రఘు,జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఖలీల్ ఖాన్,జిల్లా అధికారి ప్రతినిధి ముక్కెర లాలయ్య,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు,జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు కొండగొర్ల పోషయ్య,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగిరి మధుబాబు,జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సర్వ అక్షిత్,కన్నాయిగూడెం మండల అధ్యక్షులు ఎండీ అప్సర్ పాషా, మండల ఉపాధ్యక్షులు వీసం నర్సయ్య మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## కర్నే ఎల్లమ్మ బండారు ఉత్సవంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ నేత రాజుల ఆసిరెడ్డి



మక్తల్ నియోజకవర్గం ప్రతినిధి (భారత్ రిపోర్టర్): నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కర్నే గ్రామంలో జరిగిన ఎల్లమ్మ బండారు ఉత్సవాలలో పాల్గొన్న భారత రాష్ట్ర సమితి నియోజకవర్గ నేత రాజుల ఆశి రెడ్డి, మాజీ ఎంపిటిసి మారుతి గౌడ్, కర్నే బిఆర్ఎస్ నాయకులు పెద్దలు నారాయణరెడ్డి, సత్యనారాయణ గౌడ్, చక్రధర్,నరసింహులు నాయుడు,వాకిటి ప్రసాద్, కార్యక్రమలో నిర్వాహకులు వినోద్ ఏ డి ఈ ఎలక్ట్రిసిటీ, కురువ అభిరామ్, తదితరులు పాల్గొన్నారు

## కౌతాళంతెలుగు దేశం పార్టీ నందు తెదేపా పార్టీ సభ్యత్వలు పంపిణీ...

### పంపిణీ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య ,వెంకటపతి రాజు మరియు టిప్పు సుల్తాన్.తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులుచూడి సురేష్ నాయడు.



కౌతాళం మండల (భారత్ రిపోర్టర్): గత 3 నెలల కింద తెదేపా పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం.కుటుంబంలో ఎవరైనా ప్రమాదవశాత్తు వలన మరణిస్తే ఆ కుటుంబానికి అండగా నిలబడేందుకు ఆ కుటుంబానికి 5 లక్షలు రూపాయిలు తెలుగు దేశం పార్టీ అందిస్తుంది.కావున పార్టీలకతీతంగా ఎవరైనా సభ్యత్వ పొందవచ్చని తెలియజేశారు.ఈ కార్యక్రమములో మండల,గ్రామ నాయకులు కార్యకర్తలు మరియు తెలుగు యువత పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది. ఘనంగా



కౌతాళం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి... ఈరోజు సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహితీ వ్యాసారంగమ్లో ఎక్కువగా కృషి చేసాడు. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు. వీరేశలింగం స్త్రీవిద్యకై ఉద్యమించి, ప్రచారం చెయ్యడమే కాక, బాలికల కొరకు పాఠశాలను ప్రారంభించాడు అలాంటి మహనీయుని స్మరించుకుందాం అని తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య ,వెంకటపతి రాజు,టిప్పు సుల్తాన్ ,సౌద్రి బసవరాజు, డా"రాజానందన్, హాల్వి సిద్దప్ప,కురువ వీరేష్,మారెప్ప,చంద్రప్ప గౌడ్,రామలింగ ,గిరి , నరసప్ప రౌడూరు నిద్రి శివ మొదలగు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది

## అమ్మపల్లి బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న వరకట్నం జగన్నాథ్ రెడ్డి



మక్తల్ నియోజకవర్గం ప్రతినిధి (భారత్ రిపోర్టర్): నారాయణపేట జిల్లా మాగనూరు మండలం అమ్మపల్లి శివప్ప నరసమ్మ దంపతులకు నూతన ఇంటి నిర్మాణానికి 3 లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి పూర్తి సహాయం అందించిన వి జె ఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి నేడు నూతన గృహానికి ప్రారంభోత్సవం లో పాల్గొన్నారుమాగనూరు మండలంలోని అమ్మపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన శివప్ప నరసమ్మ దంపతులకు పూరి గుడిసె ఉండేది ఇటువంటి పరిస్థితుల్లో వి జె ఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి ని సంప్రదించగా ఆయన వెంబడే స్పందించి వారి జీవన స్థితిగతులను చూసి చలించి పోయి వారి నూతనంటి నిర్మాణానికి 3 లక్షల రూపాయలు సహాయం అందించి ఇంటి నిర్మాణం పూర్తిగా విజేఆర్ ఫౌండేషన్ ద్వారానే నిర్మించడం జరిగింది. నేడు బుధవారం నూతన గృహప్రవేశం కుటుంబ సభ్యులతోకలిసిప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గ్రామస్తులు వీ జే ఆర్ గారిని అభినందించారు. అనంతరం గ్రామంలో జరిగిన బీరప్ప ఉత్సవాలలో పాల్గొని భోజనాలు ఆరగించారు



## తెలుగు దేశం పార్టీ సీనియర్ ముఖ్య నాయకులు పెద్ద వలీ సాబ్ మృతి..



కౌతాళం మండల (భారత్ రిపోర్టర్):కౌతాళం మండల బదినేహాళు గ్రామ సీనియర్ ముఖ్య నాయకులు పెద్ద వలీ సాబ్ అనారోగ్య కారణాలు వలన ఈరోజు ఉదయం మరణించడం జరిగినది.విషయం తెలుసుకున్న తెదేపా కుటుంబ సభ్యులు గ్రామానికి వెళ్ళి మృతదేహానికి నివాళు లు అర్పించి,శాంతి చేకూరాలని ఆశిస్తూ, శోకసంద్రములో ఉన్న కుటుంబాన్నీ పరామర్శించి ధైర్యం ప్రసాదించాలనిఆ బాగువాంతును కోరుతుతెలుగు దేశం పార్టీ తరపున,అండగా ఉంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో వెంకటపతి రాజు,సురేష్ నాయుడు, టిప్పు సుల్తాన్, హాల్విసిద్దప్ప ,రామలింగ మారెప్ప బాధినేహాల్,గ్రామ నాయకులు నరసింహ,ఈరన్న,షబ్బీర్, వీరేష్ మొదలగు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.



## జిల్లా లో కొత్త గా బాధ్యతలు స్వీక రించిన విద్యుత్ సర్కిల్ టి. వెంకట రమణ.



నారాయణపేట జిల్లా ప్రతినిధి,భార త్ రిపోర్టర్:– నారాయణపేటజిల్లాకు కొత్తగావచ్చిన విద్యుత్తు సర్కిల్ బాధ్యతలు స్వీకరించిన టి. వెంకటర మణ కు మర్యాద పూర్వకంగా భార తీయ కిసాన్ సంఘం సభ్యులు కలి సి అభినందనలు తెలపడం జరిగిన సందర్భంగా శాలువాతో సన్మానించ డం జరిగినది. కార్యక్రమంలో భాగం గా డి ఈ టీ శ్రీనివాస్, డి ఈ నరసిం హారాజు, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ. జి ల్లా కార్యదర్శి అనంతరెడ్డి. జిల్లా ఉ పాధ్యక్షులు శాస మూల బాలప్ప.జి ల్లా సహాయ కార్యదర్శి ప్రభు మిస్కె న్, జిల్లా కోశాధికారి రంగారెడ్డి,పటే ల్. నగర అధ్యక్షులు ఆకుల వెంకట ప్ప.నగర ఉపాధ్యక్షులు తంగు విశ్వ నాథ్ రెడ్డి. నగర కార్యదర్శి ఆంజనే యులు. ఉపాధ్యక్షులు గొడుగులక్ష్మీ నారాయణ.పరిగి మారి మాజీఅధ్య క్షులు నరసింహారెడ్డి పెరపల్ల కిష్టప్ప వల్లంపల్లి శివ హనుమంతు తదిత రులు పాల్గొనడం జరిగినది.

## సూక్ష్మ సేద్యంతో అధిక దిగుబడులు సాధించాలి: ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ




నార్పల (భారత్ రిపోర్టర్) నార్పల మండల కేంద్రంలో నిర్వహించిన సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో పాటు, సూక్ష్మ సేద్యం ప్రాధాన్యతను వివరించారు.డ్రిప్ సేద్య విధానంవల్ల నీటి పొదుపుతో పాటు తక్కువ ఖర్చులో అధిక దిగుబడులు సాధించవచ్చని, ఇది రైతుల ఆర్థిక స్థితి మెరుగుపర్చేలా సహాయపడుతుందని పేర్కొన్నారు.నీటి వినియోగం తగ్గడంతో పాటు ఎరువులు, మందుల వాడకం తగ్గడం వల్ల రైతులకు దీర్ఘకాలిక లాభాలు కలుగుతాయని తెలిపారు.పరికరాలు పొందిన రైతులు వాటిని సమర్థంగా వినియోగించి ఆశించిన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు మన కూటమి ప్రభుత్వంలో కొనసాగుతాయని హామీ ఇచ్చారు. అనంతరం ఇక్కడికి విచ్చేసిన వారందరికీ భోజనం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో నార్పల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల విజయ్ కుమార్ (బాబు) ఆకుల ప్రసాద్, అధికారులు అధికారులు, పోలీస్ సిబ్బంది,ఆరు మండలాల కన్వీనర్లు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొనారు.

## నార్పల సత్యనారాయణ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు మరియు అభిమానులు



నార్పల (భారత్ రిపోర్టర్) వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనంతపురం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నార్పల సత్యనారాయణ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానులు ఆయన ఇంటికి తరలివచ్చారు. కార్యకర్తలు అభిమానులు సత్యనారాయణ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు, ఆయన నిండు నూరేళ్లు సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండాలని అభిమానులు కార్యకర్తలు కోరుకున్నారు. ఆయన ఇంటికి తరలివచ్చిన కార్యకర్తలకు అభిమానులకు సత్యనారాయణ రెడ్డి పేరుపేరునా అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆయనకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన వారిలో ఖాదర్ ఖాన్, సింగనమల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అమీర్ భాష, తదితరులు పాల్గొన్నారు.

## ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌కు పోలీసుల నోటీసులు



తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో నోటీసులు ఇచ్చారు. ఈ నెల 12న స్మితా సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు జారీ చేసినట్లు సమాచారం. తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో నోటీసులు ఇచ్చారు. ఈ నెల 12న స్మితా సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు జారీ చేసినట్లు సమాచారం. ఇన్‌స్టాగ్రామ్‌లో తప్పుడు వీడియోలు ట్యాగ్ చేసినందుకు సీనియర్ ఐఏఎస్ అధికారికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఆమెకు నోటీసులు జారీ చేసినట్లు గచ్చిబౌలి పీఎస్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ హబీబుల్లా ఖాన్ తెలిపారు. ఇప్పటికే కంచ గచ్చిభూముల వ్యవహారంలో ఇప్పటికే పలువురికి నోటీసులు జారీ చేసి విచారణకు పిలుస్తున్న పోలీసులు.. తాజాగా స్మితా సబర్వాల్‌కు నోటీసులు జారీ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా.. మార్చి 31న హాయ్ హైదరాబాద్ అనే ట్విట్టర్ హ్యాండిల్ నుంచి పోస్ట్ చేసిన గిబ్లి తరహాలో ఉన్న ఇమేజ్‌ని స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు. ఈ ఫొటో ఫేక్ ఇమేజ్‌గా పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే సెక్షన్ 179 కింద ఆమెకు నోటీసులు జారీ చేశారు.

భారత్ రిపోర్టర్ BHARATH REPORTER RNI.APTEL/16364/2023



## 80 వేల హెక్టార్లకు డ్రిప్ స్పీకర్ పరికరాల పంపిణీ



నార్పల (భారత్ రిపోర్టర్) సింగనమల నియోజకవర్గంలో ఆరు మండలాలలో రైతులకు 80,000 హెక్టార్ల మేరకు రైతుల డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు అందిస్తున్నామని సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. మండల కేంద్రమైన మార్పలలో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణమునందు అగ్రికల్చర్ అనుబంధ సంఘాలు ఏర్పాటు చేసిన డ్రిప్పు స్పీకర్ పరికరాల పంపిణీ కార్యక్రమంలో సమావేశంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యత్తులో సింగనమల నియోజకవర్గంలో ప్రతి చెరువును నింపడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో కేవలం 59,000 హెక్టార్ల కే డ్రిప్ ఇరిగేషన్ ఇచ్చి రైతులకు అన్యాయం చేశారని ప్రస్తుతం యువగలం పాదయాత్రలో రైతుల సమస్యలు తెలుసుకున మంత్రి లోకేష్ బాబు రైతుల ఇబ్బందులను స్వయంగా చూసి రైతుకు నీరు అందిస్తే బంగారం పండిస్తారని గ్రహించి రైతులపై పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గతంలో మీడ్ పెన్నార్ చివరి ఆయకట్టు వరకు 120 రోజుల సరఫరా జరిగే సాగునీరు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో 150 రోజులు పాటు సాగునీరు అందించమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు ఇవ్వకుండా అన్యాయం చేస్తే కూటం ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే ట్రిప్పు స్ప్రింకర్ పరికరాలను పంపిణీ చేసిందన్నారు. కేవలం ఒక సింగనమల నియోజకవర్గం లోని 4800 హెక్టార్లకు 4394 మంది గతంలో 5 ఎకరాల వారికి పరిమితం చేసిన వైసీపీ ప్రభుత్వం రైతుకి ఏమాత్రం ఉపయోగపడలేదన్నారు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఐదు ఎకరాల నుంచి పది ఎకరాల వరకు రైతులకు 90 శాతం సబ్సిడీతో పరికరాలు పంపిణీ చేసిందన్నారు. ఎస్సీ ఎస్టీలకు అయితే 100శాతం సబ్సిడీతో డ్రిప్ స్ప్రింక్లర్ పనికిరాని అందిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి చివరి ఆయకట్టు వరకు సాగునీరందించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కేలం శింగనమల నియోజక వర్గంలో మీడ్ పెన్నార్ కింద 5 కోట్ల 30 లక్షల రూపాయల పనులు చేసేందుకు ఆర్థిక మంత్రి భయ్యా దగ్గర డిపిఆర్ సిద్ధంగా ఉంచామన్నారు. త్వరలోనే మంజురవుతాయని, వచ్చే సీజన్లో ప్రతి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రస్తుతం జరిగిన గాలివానకు పడిపోయిన అరటి, మామిడి, చీని తోటలకు ఆయా శాఖల అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. రైతులకు ఎంత మేరకు నష్టపోయిన ప్రతి రైతుకు వారు నష్టపోయిన పంటకు నష్ట పరిహారం కూటమీ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు రైతులు బాధపడాల్సిన అవసరం లేదని ప్రకృతి వల్ల ఇబ్బంది పడ్డ ప్రతి రైతు సహాయం పొందుతాడన్నారు ఈసందర్భంగా అయాప్రాంతాలకు డ్రిప్ పరికరాల వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఎంపీడీఓ భాస్కర్, తహసిల్దార్ అరుణకుమారి, వ్యవసాయ అధికారి చిన్న వీరస్వామి, సిఐ కౌలుట్లయ్య, ఎస్సై సాగర్, ఆకులబాబు, ప్రసాద్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ఏపీ ఎం ఐ పి డి రఘునాథ్ రెడ్డి, జిల్లా ఉద్యాన వన అధికారి ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు

## ఘనంగా ఇరుగు పిచ్చయ్య జన్మదిన వేడుకలు



మఠంపల్లి, సూర్యాపేట జిల్లా :(భారత్ రిపోర్టర్ )సూర్యాపేట జిల్లా మండల కేంద్రమైన మఠంపల్లి లో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఇరుగు పిచ్చయ్య జన్మదిన వేడుకలు బుధవారం మఠంపల్లి మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మన్నెం మాట్లాడుతూ ఉద్యమం లో అలుపెరుగనిపోరాటాలు చేసి ఉద్యమం ద్వారా తెలంగాణ రాష్టాన్ని సాధించిన పార్టీ లో విధేయుడు గా పనిచేస్తున్న పిచ్చయ్య రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన ఆకాంక్షిచారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు ఇరుగు పిచ్చయ్య మాట్లాడుతూ నేను నమ్ముకున్న పార్టీ కి విధేయుడుగా పనిచేస్తూ అందరివాడిగా ముందుకు సాగుతానని అన్నారు. ఈకార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ కి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మేజర్ పంచాయతీ కౌతాళం మండల కేంద్రంలో సకాలంలో నీటి సరాఫరాను ఏర్పాటు చేయండిఅని పంచాయతీ సెక్రటరీ కు జై భీమ్ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు నాగేంద్ర సామెల్ మెమోరాం ఇవ్వడం జరిగింది



కౌతాళం మండల (భారత్ రిపోర్టర్): కౌతాళం మండల కేంద్రంలో నీటి సరాఫరా గత కొన్ని సంవత్సరాల నుండి చాలా తీవ్రంగా ఉంది నెలకు ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే నీటి సరఫరా చేయుచున్నారు. దీనివలన ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కాబట్టి రాజనగర్ క్యాంపు నందు గల సమ్మర్ స్టోర్ మండలానికి మొత్తం ఒకే వాటర్ మోటర్ బిగించినారు కావున మేజర్ పంచాయతీకి ప్రత్యేకమైన వాటర్ మోటర్ ఏర్పాటు చేయవలసిందిగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేవన్న డిమాండ్ చేశారు. అదేవిదంగా జ్ఞానానికి మూలమైన గ్రంథాలయాన్ని తీసుకొని ఊరి చివరన నిర్మించారు ఇది ఎంతవరకు సమంజసం. కాబట్టి గ్రంథాలయాన్ని ఊరు మధ్యలో ఏర్పాటు చేయుటకు కూడా చర్యలు తీసుకోవాలి. మండల కేంద్రంలో నీటి సరఫరా చేయుటకు ప్రత్యేకంగా వాటర్ మోటర్ ఏర్పాటు చేయాలి అని ఈ వేసవిలోనే తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. ఈ మెమోరాండాన్ని పంచాయతీ సెక్రటరీకి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు నాగేంద్ర సామెల్ పాల్గొన్నారు.

## గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన ఘనపురం పోలీసు

### -ఘనపురం పోలీస్ లను అభినందించిన జిల్లా పోలీస్ బాస్ భూపాలపల్లి డిఎస్పి, ఏ. సంపత్ రావు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిది (భారత్ రిపోర్టర్):జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి ఉపమండల పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో భూపాలపల్లి డిఎస్ పి, ఏ. సంపత్ రావు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 05.00 గంటలకు గంజాయి రవాణా గురించి తమకు వచ్చిన సమాచారం మేరకు భూపాలపల్లి డిఎస్పి, ఏ. సంపత్ రావు ఆదేశాల మేరకు చిట్యాల సిఐ మల్లేశ్ పర్యవేక్షణలో ఎస్ఐఐ అశోక్ తన సిబ్బందితో కలిసి రవినగర్ గ్రామ శివారులో గల మంగలోని కుంట మత్తడి వద్ద మాటు వేసి ఉండగా ముగ్గురు వ్యక్తులు %=౦%.5,60, 500/- (1 కేజీ 50,000) విలువ గల 11 కిలోల 210 గ్రాముల నిషేదింపబడిన ఎండు గంజాయి ఒక సంచిలో పట్టుకొని ఉండగా, వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా, వీరు సంపాదించే డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో గత కొద్ది రోజులుగా వీరు అక్రమంగా ఒరిస్సా రాష్ట్రం లోని కొండ ప్రాంతాలలో గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర తక్కువ ధరకు తెచ్చి భూపాలపల్లి మరియు ఘనపురం మండల్ పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నారని తెలిపారు నిందితులు ఆరెల్లి అఖిల్ గుర్రంపేట్ గ్రామం, భూపాలపల్లి మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా. (ఇతను గతంలో హన్మకొండ పోలీసు స్టేషన్ లో గంజాయి కేసు 198/2025) లో నేరస్తుడు ఆముదాల కార్తీక్ చెల్పూర్ గ్రామం ముస్కే రోహిత్ వరికోల్ గ్రామంఈ సంధర్భంగా భూపాలపల్లి డిఎస్ పి, ఏ. సంపత్ రావు మాట్లాడుతూ గంజాయి నియంత్రణకు ప్రజలు సహకరించాలని, పూర్తి స్థాయిలో నియంత్రించుటకు పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని, గంజాయి కి సంబంధించిన ఈ సమాచారం ఉన్నా డయల్-100 ద్వారా గాని స్థానిక పోలీసు అధికారికి చేరవేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇట్టి 11 కిలోల 210 గ్రాముల పట్టుకోవడంలో ఉత్తమ విధులు నిర్వహించిన చిట్యాల సీఐ మల్లేశ్, సిసిఎస్ సిఐ వెంకటేశ్వర్లు మరియు ఘనపురం (ము) ఎస్ ఐ అశోక్, సిసిఎస్ ఎస్ఐ భాస్కర్ రావు మరియు సిబ్బంది జే. శ్రీనివాస్, ఏ, అశోక్, పి. క్రాంతి మరియు పి. నేతాజీ లను భూపాలపల్లి డి ఎసిపి, ఏ. సంపత్ రావు ప్రత్యేకంగా అభినందించారు.



# పొగాకు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

### -అసెంబ్లీ సాక్షిగా పత్తిపాటి మాట్లాడిన కూడా స్పందన కరువైంది

### -రైతులకు మద్దతుగా నిలుస్తాం ఏ.పీ.గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు....బి.శ్రీను నాయక్.

చిలకలూరిపేట ఏప్రిల్ 16 ( భారత్ రిపోర్టర్)-ననల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్ రావు అధ్యక్షతన జరిగిన రైతులు పండించిన నల్ల బర్లి పొగకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు మరియు ఏ.పీ గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు పొగాకు రైతులకు మద్దతుగా రైతు నాయకులతో,రైతులతో కలసి స్థానిక తాహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పలుపార్టీ నాయకులు మాట్లాడుతూ... పొగాకు రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వహిస్తుందని దీనివలన పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ వెంటనే జోక్యం చేసుకొవాలని వారికి గిట్టుబాటు ధర కల్పించి రైతులు యొక్క కష్టాలను తొలగించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.





పొగాకు రైతులకు మద్దతు తెలిపిన ఏ.పీ

### గిరిజన సంఘాల ఐక్య వేదిక

బి.శ్రీను నాయక్ మాట్లాడుతూ-విదేశీ మార్కెట్ లో నల్ల బర్లీ పొగాకు మంచి ధర ఉందని రాజకీయ నిపుణులు,శాస్త్రవేత్తలు చెప్పుతున్నప్పటి మన రాష్ట్ర రైతుల వద్దకు వచ్చి క్వింటా రూ.3,నుంచి 4వేలకు ఇస్తారని బేరాసారాలు ఆడుతున్నారు.ఉన్నటువంటి కంపెనీ యాజమాన్యాలు ఒక్కటై రైతులకు తీవ్ర మైన అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత వాసిగా శాసన సభ్యులు "ప్రత్తిపాటి పుల్లారావు" అసెంబ్లీ సాక్షిగా పొగాకు రైతులకు అన్యాయం జరుగుతుంది.పొగాకు ఎగుమతులపై కేంద్రానికి 2023-24 సంవత్సరం లో సుమారు 12.006 కోట్లు ఆదాయం వచ్చిందని,నల్ల బర్లీ పొగాకు విదేశాల్లో గిరాకీ ఉందని చెప్పిన ప్రభుత్వం పట్టించుకోవడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయమై జోక్యం చేసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.రైతులు చేసే కార్యక్రమాలకు గిరిజన సంఘం నుంచి సంపూర్ణ మైన మద్దతు తెలియజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రైతులు, సి.పి.ఐ,సి.పి.ఎం,కాంగ్రెస్, వి.సి.కె పార్టీ నాయకులతోపాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని స్థానిక తహసిల్దార్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.

## దళితుల సమాన అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం రాష్ట్ర పార్టీ కార్యదర్శి...ఇన్నగంటి జగదీష్

**చిలకలూరిపేట ఏప్రిల్ 16 భారత్ రిపోర్టర్)- దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని మరోసారి చంద్రబాబు రుజువు చేశారని, ఎస్సీ ఉప వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం తో నాయకులు హర్షం వ్యక్తం చేశారు.**



ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ౧- గతంలో రాజీవ్ రంజాన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దాని పై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదిక పై కేబినెట్ చర్చించి, వీటి ప్రకారం 200 పాయింట్ల రోస్టర్ అమలుకు నిర్ణయించిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోనే ఎస్సీ వర్గీకరణ వివాదం మొదలైందని, మాల, మాదిగ సహా 59 కులాలు, ఉపకులాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించారని అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ జనాభా 1,38,78,078 మంది. వీరిలో మాదిగలు 67,02,609 కాగా, మాలలు 55,70,244. మాదిగల జనాభా మాలలకంటే 11,32,365 మంది ఎక్కువ అని అన్నారు. 1997 లో ఎ, బి, సి, డి గా వర్గీకరణ చేయాలని ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ ఉద్యమం ఉప్పెనలా సాగడంతో షెడ్యూల్డ్ కులాల మధ్య నెలకొన్న సామాజిక అసమానతలు అధ్యయనం చేసేందుకు 1996 సెప్టెంబర్ 10న రామచంద్రరాజు కమిషన్ ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఈ డిమాండ్ కు అనుకూలంగా తీర్మానం చేశారని అన్నారు. 1997 జూన్ 6న ప్రభుత్వం జీవో ద్వారా షెడ్యూల్డ్ కులాల కోటాను వర్గీకరించింది. ఈ జీవో ప్రకారం ఎస్సీలను ఎ, బి, సి, డి గ్రూపులుగా వర్గీకరించారని అన్నారు. ఎస్సీ ఉప వర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉపకులాలకు 1శాతం, గ్రూప్-2లో 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్-3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఆమోదంతో అందరికి న్యాయం జరుగుతుందని అన్నారు. ఎ గ్రూపులో రెల్లి సహా 12 కులాలు, బి గ్రూపులో మాదిగ సంబంధిత 18 కులాలు, సి గ్రూపులో మాల కులస్తులతో పాటు మరో 24 కులాలు, డి గ్రూపులో ఆది ఆంధ్ర కులాలను చేర్చారని, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని ధర్మాసనం తుది తీర్పు ఇచ్చిందన్నారు. కేబినెట్ ఆమోదంతో ఎస్సీ లందరు కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారని, హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జి.పి కుమార్, ఎస్సీ నాయకుడు ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.

## శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ శికర ప్రతిష్ట మహోత్సవం

రాయికోడ్/యూసుపూర్:ఏప్రిల్16 (భారత రిపోర్టర్)సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం రాయికోడ్ మండల పరిధిలోని యూసుపూర్ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి నంది గణపతి సుబ్రమణ్య స్వామి విగ్రహ శిఖర ప్రతిష్ట మహోత్సవము శ్రీ సద్గురు సోమలింగ శివాచార్య మహా స్వామీజీ సంస్థాన్ మఠం బీచ్కుంద గురువు ఆధ్వర్యంలో తేదీ 23/04/2025 బుధవారం రోజున విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించబడును అని తెలిపారు భక్తులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు సభ్యులు తెలిపారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డి



జహీరాబాద్/ఝరాసంగం: ఏప్రిల్ 16(భారత రిపోర్టర్) ఝరాసంగం గ్రామ రేషన్ డీలర్ కంటానం మల్లయ్య స్వామి కుమార్తె సంధ్య - ప్రణవ్ ల వివాహ వేడుక బుధవారం రోజున ఝరాసంగం గ్రామంలో ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకీ తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డి, పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపారు.వారితో పార్టీ ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్,కేతకీ ఆలయం చైర్మన్ రాజశేఖర్ పాటిల్,నర్సింహారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ భీమయ్య,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్,అశ్విన్ పాటిల్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ న్యాల్కల్ ఝరాసంగం మండలాల అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్ గౌడ్,రాఘవేందర్,మాజీ యం.పి.టి.సి హఫీజ్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి,నథానేయల్,నర్సింహా యాదవ్,ఇమామ్ పటేల్,రాజు మరియు ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజస్థాన్ రాయల్స్ టార్గెట్ 189 పరుగులు..



రాజస్థాన్ రాయల్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ 189 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లకు ఐదు వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. ఢిల్లీ తరపున ఏ బ్యాట్స్‌మెన్ కూడా భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లకు ఐదు వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. ఢిల్లీ తరపున ఏ బ్యాట్స్‌మెన్ కూడా భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. ఢిల్లీ తరపున పోరెల్ అత్యధికంగా 49 పరుగులు చేయగా.. కేఎల్ రాహుల్ 38 పరుగులు చేశాడు. జాక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, పోరెల్ జోడీ మంచి ఆరంభం అందించగా.. జోఫ్రా ఆర్చర్ అద్భుతమైన బంతితో మెక్‌గుర్క్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత కరుణ్ నాయర్ ఖాతా తెరువకుండానే రనౌట్‌గా వెనుదిరిగాడు. ఐపీఎల్‌లో కరుణ్ నాయర్ డకౌట్ కావడం ఇది నాలుగోసారి. రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లోపడ్డ ఢిల్లీని రాహుల్-పోరెల్ జోడీ ఆదుకుంది.ఆరు వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. 32 బంతుల్లో 38 పరుగులు చేసిన రాహుల్‌ను ఆర్చర్ విడగొట్టాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే పోరెట్ అవుట్ అయ్యాడు. తృటిలో హాఫ్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. ఆ తర్వాత కెప్టెన్ అక్షర్ పటేల్ క్రీజులోకి వచ్చి దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అక్షర్ 14 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 34 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. చివరి ఓవర్లలో ట్రిస్టాన్ స్టబ్స్, అశుతోష్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో జట్టు స్కోరు 180 దాటింది. స్టబ్స్ 18 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 34 పరుగులు, అశుతోష్ 11 బంతుల్లో రెండు ఫోర్లతో 15 పరుగులు చేశాడు. రాజస్థాన్ బౌర్లలో ఆర్చర్ రెండు వికెట్లు, మహేష్ తీక్షణ, వానిందు హసరంగా తలో వికెట్ దక్కింది.

## వన్డే క్రికెట్ భవితవ్యంపై రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు..!



ప్రస్తుతం టీ20 క్రికెట్ ఆదరణ పెరుగుతున్నది. ఈ క్రమంలో వన్డే క్రికెట్ భవితవ్యంపై రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్‌తో కలిసి నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో రోహిత్ శర్మ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు ఎదుర్కొన్న సవాళ్లపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం టీ20 క్రికెట్ ఆదరణ పెరుగుతున్నది. ఈ క్రమంలో వన్డే క్రికెట్ భవితవ్యంపై రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్‌తో కలిసి నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో రోహిత్ శర్మ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు ఎదుర్కొన్న సవాళ్లపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇతర ఫార్మాట్‌లకు భిన్నంగా వన్డే క్రికెట్ ఎప్పుడూ సవాల్‌గా ఉంటుందని.. ప్రస్తుతం టీ20 క్రికెట్‌కు ప్రజాదరణ పెరుగుతున్నప్పటికీ అది అత్యంత గౌరవనీయమైన ఫార్మాట్‌లలో ఒకటిగా ఉందని వ్యాఖ్యానించారు. 50 ఓవర్ల ఫార్మాట్‌తో తనకు మంచి బంధం ఉందని.. క్రికెటర్‌గా తన బాల్యంతో ముడిపడి ఉందని తెలిపాడు. వన్డే క్రికెట్ శాశ్వతమైనా.. కాకపోయినా దాని గురించి చాలా విషయాలు చెబుతారనే విషయం తనకు తెలుసనని చెప్పాడు.మనమందరం వన్డే ప్రపంచకప్, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ చూస్తు పెరిగామని.. తాము అందులో ఆడామని.. ఆ మ్యాచులన్నీ ఉత్తేజకరమైనవని చెప్పాడు. అవన్నీ గతానికి సంబంధించినవని తనకు తెలుసునని.. ఎందుకంటే ఇప్పుడు జనం టీ20 క్రికెట్‌ని చూస్తున్నారని.. కానీ, వన్డే క్రికెట్‌లో సవాల్ భిన్నంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. రోహిత్ కెప్టెన్సీలో ఇటీవల భారత జట్టు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని గెలిచిన విషయం తెలిసిందే. ఈ టోర్నీలో ఐదు మ్యాచుల్లో కలిపి రోహిత్ 180 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో 83 బంతుల్లో 76 పరుగులు చేశాడు. వన్డేల్లో రోహిత్ రికార్డు బాగుంది. 273 మ్యాచ్‌ల్లో 11,138 పరుగులు చేశాడు. 2023 వన్డే ప్రపంచ కప్‌లో రాణించాడు. ప్రస్తుతం ఐపీఎల్ ముంబయి ఇండియన్స్ తరఫున ఆడుతున్నాడు. ఇప్పటి వరకు బ్యాటింగ్‌తో ఆకట్టుకోలేకపోయాడు. ఐదు మ్యాచుల్లో కలిపి 11.20 సగటుతో 56 పరుగులు చేశాడు. ఈ సారి కొన్ని మ్యాచుల్లో రోహిత్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు దిగడం విశేషం.

## రిస్క్ చేస్తున్న నాని.. ఆ ఆడియన్స్‌కి దూరమయ్యే ఛాన్స్ ఉందా?



ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి తన టాలెంట్‌తో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు నాని. అతనిని చూస్తే మన పక్కింటి కుర్రాడు అనే ఫీలింగ్ అందరికి కలుగుతుంది. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి తన టాలెంట్‌తో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు నాని. అతనిని చూస్తే మన పక్కింటి కుర్రాడు అనే ఫీలింగ్ అందరికి కలుగుతుంది. న్యాచురల్ యాక్టింగ్‌తో న్యాచురల్ స్టార్ అనే బిరుదుని కూడా అంది పుచ్చుకున్నారు నాని. అయితే నానికి ఫ్యామిలీ ఆడియన్స్ నుండి టీనేజర్స్ వరకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఆయన నటనని, సినిమాలని ప్రతి ఒక్కరు పిచ్చిగా ఎంజాయ్ చేస్తూ ఉంటారు. నాని సినిమా అంటే మినిమం గ్యారెంటీ ఉంటుంది. నాని సినిమా ఏదైనా సరే టాక్ తో సంబంధం లేకుండా ఫస్ట్ డే చూడటానికి తెగ ఇంట్రెస్ట్ చూపిస్తుంటారుఈగ నుండి మొదలుకొని సరిపోదా శనివారం వరకు నాని విభిన్న కథా చిత్రాలతో ప్రేక్షకులని అలరించాడు. అయితే నాని ఇప్పటి వరకు చేసిన ప్రతి చిత్రంలో కూడా ఎంతో కొంత ఫ్యామిలీ టచ్ ఉంటుంది. ఇప్పుడు వాటికి భిన్నంగా నాని ట్రై చేస్తున్నాడు. నాని ఇప్పుడు చేస్తున్న హిట్ 3, ది ప్యారడైజ్ చిత్రాలు చూస్తుంటే నాని ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు కొంత యూత్ ఆడియన్స్‌ని కూడా దూరం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. హిట్-3 ట్రైలర్ రిలీజ్ అయ్యాక నానినే నా పిల్లాడిని ఈ మూవీకి తీసుకెళ్లనని చెప్పాడు. ఇన్‌డైరెక్ట్‌గా క్లాస్ ఆడియన్స్, ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలు రావొద్దని చెప్పుకొచ్చాడు.ఇక ప్యారడైజ్ లో కూడా వయొలెన్స్ ఎక్కువ ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్యారడైజ్ నుంచి రిలీజయిన గ్లింప్స్ లో ఓ బూతు పదాన్ని హైలెట్ చేయడం చర్చగా మారింది.అయితే నానినే ఫ్యామిలీ ఆడియన్స్‌ని థియేటర్‌కి రావొద్దని డైరెక్ట్‌గా చెప్పడంతో ఎందుకు వారిని దూరం చేసుకుంటున్నాడు అని ఫ్యాన్స్ తలలు పట్టుకుంటున్నారు. నాని వంద కోట్ల హీరోగా మారాడంటే దాని వెనక ఫ్యామిలీ ఆడియన్స్ సపోర్ట్ తప్పక ఉంటుంది. మాస్ ఇమేజ్ కోసం ట్రై చేస్తున్న నాని ఇంత వయొలెన్స్ తో సినిమాలు తీయడం అవసరమా అని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఇక నాని హిట్ 3 సినిమా మే 1న రిలీజ్ కానుండగా, ఈ సినిమా టాక్ ఎలా ఉంటుంది, ఫ్యామిలీ ప్రేక్షకులు థియేటర్స్‌కి వస్తారా అన్నది చూడాలి

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ రిపోర్టర్
RNI.APTEL/2023/88573
తెలుగు దినపత్రిక
BHARATH REPORTER


## ఢిల్లీ, ముంబయి రెడ్ జోన్‌లో ఉన్నాయి





న్యూఢిల్లీ : కాలుష్యం విషయంలో ఢిల్లీ, ముంబయి రెడ్ జోన్‌లో ఉన్నాయని, దేశ రాజధానిలో మూడు రోజుల ఉంటే అనారోగ్యం పాలవడం ఖాయమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగిత దేశ రాజధానిలో నివసించే ప్రజల ఆయుర్దాయం పది సంవత్సరాలు తగ్గుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటికైనా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలని మంత్రి సూచించారు. రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ఆర్థిక వ్యవస్థకుఇచ్చే ప్రాధాన్యాన్ని పర్యావరణానికి కూడా ఇవ్వాలనే అభిప్రాయాన్ని గడ్కరీ వ్యక్తం చేశారు. కాలుష్యానికి పెట్రోల్, డీజెల్ ప్రధాన కారణమని ఆయన అన్నారు. వాహనాల్లో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు, భారత్ సుమారు రూ. 22 లక్షల కోట్లు విలువ చేసే శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటున్నదని ఆయన గుర్తు చేశారు. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించవలసిన సమయం ఆసన్నమైందని గడ్కరీ అన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్షంగా భారత్ ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ రంగాల్లో ప్రపంచ స్థాయి సదుపాయాలను కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన తెలియజేశారు. అభివృద్ధి చెందిన దేశాల లాజిస్టిక్ ఖర్చులు 12 శాతం లోపు ఉంటే మన ఖర్చులు 16 శాతం ఉన్నాయని ఆయన చెప్పారు. వచ్చే సంవత్సరం చివరి నాటికి మన ఖర్చులను సింగిల్ డిజిట్‌కు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని గడ్కరీ స్పష్టం చేశారు.

## వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లకు మమత ప్రేరేపణ



కొచ్చి : వక్ఫ్ చట్టంపై నిరసనలు వ్యక్తం చేయాలని ప్రజలను కోరుతూ చేసిన వ్యాఖ్యల ద్వారా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'హింసాకాండను ప్రేరేపించార'ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం ఆరోపించారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కొచ్చిలో విలేకరుల గోష్ఠిలో మాట్లాడుతూ, పార్లమెంట్ ఆమోదించిన సవరించిన వక్ఫ్ చట్టాన్ని తాను అమలు చేయబోనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. 'ఎలా? దానిని తాను అమలు చేయబోనని ఆమె ఎలా అంటారు? ఆమె ఒక రాజ్యాంగ పదవిని నిర్వహిస్తున్నారు, ఆ చట్టాన్ని ఒక రాజ్యాంగ సంస్థ ఆమోదించింది, రాజ్యాంగబద్ధమైన అంశాన్ని తాను అనుసరించబోనని ఆమె ఎలా అంటారు' అని ఆయన నిలదీశారు. వక్ఫ్ చట్టం పశ్చిమ బెంగాల్‌లో అమలు కాబోదన్న మమతా బెనర్జీ ప్రకటనకు సంబంధించిన ప్రశ్నలకు రిజిజు అలా స్పందించారు. ఆ రాష్ట్రంలో వక్ఫ్ చట్టానికి సంబంధించిన దౌర్జన్య ఘటనల గురించిన ప్రశ్నలకు సమాధానంగా రిజిజు అందుకు మమతదే బాధ్యత అని నిందించారు. 'నిరసనలు వ్యక్తం చేయవలసిందిగా ప్రజలను కోరడం, పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని తాను అమలు చేయబోనని చెప్పడం ద్వారా సిఎం దౌర్జకాండకు ప్రేరేపించినట్లు కనిపిస్తోంది' అని రిజిజు ఆరోపించారు. వక్ఫ్ (సవరణ) చట్టానికి సంబంధించి తాజాగా దౌర్జన్య సంఘటనలు సోమవారం పశ్చిమ బెంగాల్ 24 పరగణాల జిల్లా భంగర్ ప్రాంతాన్ని కుదిపివేశాయి. ఇంతకుముందు ఆ రాష్ట్రంలోని ముర్షిదాబాద్ జిల్లాలో ఆ చట్టానికి సంబంధించి దౌర్జన్య సంఘటనలు చోటు చేసుకున్నాయి.

## రాష్ట్ర స్వయంప్రతిపత్తి కోసం ఉన్నతస్థాయి కమిటీ



చెన్నై : గవర్నర్ ఆర్.ఎన్.రవితో విబేధాలతో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై చర్యలను సిఫార్సు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. రిటైర్డ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలో మాజీ అధికారులు అశోక్ శెట్టి, ము.నాగరాజన్‌లతో ఉన్నత స్థాయి కమిటీని నియమించారు. రాష్ట్రప్రభుత్వాల హక్కులను పరిరక్షించడానికి, కేంద్ర ప్రభుత్వంతో సంబంధాలను మెరుగుపరచడానికి ఈకమిటీ సూచనలివ్వనుంది. జనవరి 2026 నాటికి మధ్యంతర నివేదికను సమర్పించి, 2028 నాటికి తుది నివేదికను సమర్పించాల్సి వుంది. తమిళనాడు సహా అన్ని రాష్ట్రాల హక్కులను పరిరక్షించడమే లక్ష్యమని స్టాలిన్ పేర్కొన్నారు. అసెంబ్లీలో స్టాలిన్ మాట్లాడుతూ.. "నీట్ పరీక్ష కారణంగా మనం చాలా మంది విద్యార్థులను కోల్పోయాం. నీట్ పరీక్షను వ్యతిరేకిస్తూనే ఉన్నాము. త్రిభాషా విధానం (ఎన్ఇపి) పేరుతో కేంద్ర ప్రభుత్వం తమిళనాడులో హిందీని రుద్దడానికి ప్రయత్నిస్తోంది. ఎన్ఇపిని తిరస్కరించినందున, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.2,500 కోట్లు విడుదల చేయలేదు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యను రాష్ట్ర జాబితాలోకి తీసుకురావాలి" అని అన్నారు.

## బోయింగ్ విమానాల డెలివరీ తీసుకోవద్దు




బీజింగ్ : అమెరికా ప్రముఖ విమానయాన సంస్థ బోయింగ్ నుండి విమానాలకు సంబంధించిన పరికరాలు, విడిభాగాలను కొనుగోలు చేయవద్దని ఆదేశించినట్లు సంబంధిత అధికారులను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ న్యూస్ మంగళవారం నివేదించింది. అమెరికా నుండి విమానాల పరికరాలు, విడిభాగాల కొనుగోళ్లను నిలిపివేయాలని తమ సంస్థలను ఆదేశించినట్లు తెలిపింది. ట్రంప్ టారిఫ్‌లకు ధీటుగా చైనా అమెరికా దిగుమతులపై 125 శాతం సుంకాలను విధించింది. దీంతో బోయింగ్ విమానాలు, విడిభాగాల ఖర్చు గణనీయంగా పెరగనుంది. ఇప్పటికే బోయింగ్ నుండి విమానాలను లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న సంస్థలకు సహాయం అందించే దిశగా చైనా ప్రభుత్వం యోచిస్తోందని బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించి అమెరికాకు చైనా గట్టి షాకిచ్చిన సంగతి తెలిసిందే.

# పీడితుల పక్షపాతి బాబాసాహెబ్



అంబేద్కర్ బోధించు, సమీకరించు, పోరాడు అనే నినాదా లతో అందరినీ సంఘటితం చేశాయి. అస్పృశ్యత, అంటరా నితనం వంటి సమస్యల పరిష్కారంలో గాంధీతో అంబేద్కర్ విభేదించారు. భారత రాజ్యాంగ రచన కమిటీకి అధ్యక్షత వహించి అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను అందులో చేర్చి భారత రాజ్యాంగ పితగా వెలుగొందారు. పీడనకు గురైన వర్గాలకు రిజర్వేషన్స్ కల్పించా రు. అగ్రకులాల కుట్రలు ఛేదించి అందిరికీ ఓటు హక్కును కల్పించారు. స్వాతం త్ర్యానంతరం నెహ్రూమంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా స్త్రీల ఆస్తి హక్కుకోసం పోరాడారు. భారతదేశంలో అనాదిగా పాతుకుపోయిన కులవ్యవస్థ, అంటరానితనం, అస్పృశ్యత అనే అనాగరిక శిక్షలు బడుగు, బలహీనవర్గాలను దీనస్థితికి దిగజార్చాయి. ఇలాంటి సమాజంలో పుట్టిన ఓ ధ్రువతార డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. ఆయన 1891 ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలోని అంబేవాడలో జన్మించాడు. అంటరాని 'మహర్ కులం'లో పుట్టి బాల్యం దశలో అనేక అవమానాలకు ఎదుర్కొన్నారు. బరోడా మహారాజు ఆర్థిక సహాయంతో విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించారు. అనంతరం భారతదేశానికి తిరిగి వచ్చి ఆయన ఆ స్థానంలోనే ఉద్యోగంలో చేరారు. ఆఫీసులో నౌకర్లు అస్పృశ్యుడుగా చూడడం పెద్ద అవమానంగా భావించారు. దీంతో సామాజిక వివక్షపై పోరాడాలని సంకల్పించారు. దళితల మంచినీటికోసం మహారాష్ట్రలోని నాసిక్‌లో చేసిన 'మహాద్ చెరువు' పోరాటం అందరి దృష్టిని ఆకర్షించించింది. ఇది భారతదేశంలోనే మొదటి మానవ హక్కుల ఉద్యమం. ఆలయాల ప్రవేశాలు, పాఠశాలలో చదువు, తాగునీరు బడుగు, బలహీన వర్గాలకు అందాలని పట్టుపట్టారు. 1927లో సైమన్ కమిషన్ ముందు దళిత జాతి సమస్యలను మొట్టమొదిసారిగా నివేదించారు. అంతేకాకుండా అంబేద్కర్ 'అఖిల భారత దిగువ కులాల సమైక్య' ను స్థాపించి వారి ఉన్నతికై పోరాటం చేశారు. ఇంగ్లాండులో మూడు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొని దళితుల సమస్యలను బ్రిటిష్‌వారి దృష్టికి తీసుకెళ్లారు. అంబేద్కర్ 'బహిష్కృత భారతీ' అనే పత్రికలో తిలక్ అంటరానివాడిగా పుట్టి ఉంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అనే వారు కాదు, 'అస్పృశ్యత నివారణ నా జన్మ హక్కు'ని నినాదించేవాడని రాశారు. ఇది ఆనాడు భారతీయ సమాజంలో కులతత్వ వాదులచే అంబేద్కర్ అనుభవించిన బాధను తెలుపుతుంది. 1924లో సమానత్వ సాధనకై 'సమతా సైనిక్ దళ్' అనే సంస్థను ఏర్పాటు చేశారు. యువతలో వ్యక్తిగత క్రమశిక్షణ నేర్పిస్తూ, అగ్రకులదాడులను ఎదుర్కొనే విధంగా తయారు చేశారు. 'మూక్ నాయక్' అనే పత్రికను నడిపి 'దేశ మూలవాసుల చరిత్ర'ను వెలికితీశారు. అంబేద్కర్ బోధించు, సమీకరించు, పోరాడు అనే నినాదాలతో అందరినీ సంఘటితం చేశాయి. అస్పృశ్యత, అంటరానితనం వంటి సమస్యల పరిష్కారంలో గాంధీతో అంబేద్కర్ విభేదించారు. భారత రాజ్యాంగ రచన కమిటీకి అధ్యక్షత వహించి అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను అందులో చేర్చి భారత రాజ్యాంగ పితగా వెలుగొందారు. పీడనకు గురైన వర్గాలకు రిజర్వేషన్స్ కల్పించారు. అగ్రకులాల కుట్రలు ఛేదించి అందిరికీ ఓటు హక్కును కల్పించారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూమంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా స్త్రీల ఆస్తి హక్కుకోసం పోరాడారు. ఈ విధంగా ఆయన అన్ని వర్గాల ప్రజల సమస్యలను స్పృశించారు. జీవిత చరమాంకంలో అంబేద్కర్ నా పుట్టుక నా చేతిలో లేదు కానీ, నా చావు నా చేతిలో ఉందని ప్రకటించి హిందూ మతాన్ని వీడి మానవీయ విలువలతో కూడిన బౌద్ధాన్ని స్వీకరించారు. 1956 డిసెంబర్ 6న తుది శ్వాస విడిచారు. అంబేద్కర్ పోరాట దిశగా.. నేడు ప్రతి వ్యక్తికి అమ్మ జన్మనిస్తే.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం జీవితాన్ని ప్రసాదిస్తుంది. ఆయన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంతరాలపై లక్ష పేజీల సాహిత్యాన్ని మనకు అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారుడు. అందుకే ఐక్యరాజ్య సమితి అంబేద్కర్‌ను ప్రపంచ మేధావులలో ఒకరిగా గుర్తించింది. ఆయన జయంతిని 'ప్రపంచ విజ్ఞాన దినోత్సవం'గా ప్రకటించింది. కానీ, ఇప్పటికీ ఆయనను దళిత నాయకుడుగా సమాజం కీర్తించడం బాధాకరం. అన్నివర్గాలకు హక్కులు కల్పించిన విశ్వమానవుడు. నేడు మనమంతా రాజ్యాంగం కల్పించిన హక్కులతో విలాస జీవితాలు అనుభవిస్తున్నాము తప్ప, ఆయన ఉద్యమ రథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో విఫలమవుతున్నాం. దీంతో అన్ని రంగాలలో ఇంకా అగ్రకుల ఆధిపత్యమే కొనసాగుతుంది. దేశంలో 90 శాతం ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి కులాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ స్రవంతికి ఆమడ దూరంలోనే ఉన్నారు. ప్రస్తుతం మనల్ని కాపాడే భారత రాజ్యాంగ ఉనికికే ప్రమాదం పొంచి ఉంది. అగ్రవర్ణ పార్టీలన్నీ ఏకమై రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నారు. దేశంలో రాజ్యాంగ రక్షకులు ఒకవైపు.. రాజ్యాంగాన్ని మార్చేశక్తులు మరొకవైపుగా రాజకీయ యుద్ధం కొనసాగుతున్నది. అయినప్పటికీ ఇంకా మెజారిటీ జనాభా గల బిసి, ఎస్‌సి, ఎస్‌టి నాయకులు అగ్రవర్ణ ఆధిపత్య పార్టీల పక్షాననే నిలబడడమేంటి? అగ్రవర్ణ పార్టీలిచ్చే పదవులు, సంక్షేమ పథకాలు కాదు. ప్రజలు ఓటనే ఆయుధంతో రాజ్యాధికార యుద్ధం చేయాలి. తమ బానిస సంకెళ్లు తెంపుకొని వారే పాలకులు కావాలి. అప్పుడే దేశ సంపద ప్రజాస్వామ్యికీకరించబడుతుంది. స్వేచ్ఛ,సమానత్వం, సోదరభావం అనే రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగుతుంది. అంబేద్కర్ కోరుకున్నది కూడా అదే.

# చేనేతల్లో బహుముఖ ప్రజ్ఞ



గంటల తరబడి శ్రమిస్తేనే నోట్లోకి ఒక ముద్ద. సృజనాత్మక కళాకృతులను ప్రపంచానికి అందించాలనే ఒక దృఢ సంకల్పం. మగ్గాల నుంచి ఆధునిక మరమగ్గాల వరకు ఏ మిషనరీని ఉపయోగించినా నేతన్న చేయి లేకుంటే వస్త్రంగా ఆకృతి దాల్చదు. నాటి నుండి విభిన్న పరిణామాల అనంతరం రకరకాల వస్త్రాలుగా రూపుదిద్దుకొని, అద్దకంతో సొబగులు అద్దుకొని మార్కెట్లో ఆవిష్కరించబడుతున్నాయి. ఆ క్రమంలో అనేక సృజనాత్మక మేధస్సుతో కళలు చోటుచేసుకోవడం ఒక గొప్ప విషయం. చేతి రుమాల నుంచి మొదలుకొని పట్టువస్త్రాల వరకు అనేక విభాగాలలో ఒక్కో ఆవిష్కరణలో ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంటాయి. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా మరమగ్గాలు ఉన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పద్మశాలి వర్గం నేతవృత్తిని నమ్ముకొని పరిశ్రమలతో జీవనోపాధి పొందుతున్నాయి. కష్టపడి పని చేసి చేనేత కార్మికులు కొందరు యజమానుల వరకు ఎదిగారు. ఆ క్రమంలో అనుకూల, ప్రతికూల పరిస్థితుల కారణంతో అనేక మార్పులు సంభవించడం సిరిసిల్ల పరిశ్రమ వర్గాలలో సహజంగా ఉన్నాయి. ఇతర వృత్తులలో కంటే చేనేత వృత్తిలో కార్మికుడు ఏకధాటిగా గంటల పాటు శ్రమను వెచ్చిస్తేనే గాని ఒక ఆకృతి ముందుకు రాదు. సునిశితమైనటువంటి డిజైన్లు, అనేక సాంకేతిక విభాగాలను మిషనరీల ద్వారా అనుబంధ పరిశ్రమల కూర్పుతో ప్రత్యేకమైనది. స్పిండల్ మిషన్లు, వార్పిండ్లు, దయింగులు, లూమ్స్, ట్విస్టింగ్ మిషన్లు, సైజింగ్‌లు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఫినిషింగ్ విభాగాలు ఇలా అనేకమైనటువంటివి వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తికి ప్రత్యేక మూలాలు. ఒక్కొక్క విభాగంలో పలు రకాల నైపుణ్యత కలిగిన కార్మికుల శ్రమ ప్రత్యేకంగా ఉంటుంది. చేనేతలు ప్రత్యేక అనుభవంతో కూడిన చేనేత కార్మికుని సృజనాత్మక ప్రత్యేకత. కాలక్రమేణా సాంకేతిక మిషనరీ విభాగాలలో ప్రత్యేకతలు ఎన్ని వచ్చినప్పటికీ చేనేత వస్త్ర ఉత్పత్తిలో నిబద్ధతతో కూడిన కార్మికశక్తి ఎక్కువ శాతంగా కేంద్రీకృతమైంది. సిరిసిల్ల ప్రాంతంలో తయారైన వస్త్రాలు దేశం నలుమూలల్లోకి వెళ్లి బహుళజాతి కంపెనీల ఉత్పత్తుల పోటీకి సరసన నిలిచి 'అగ్గిపెట్టలో చీర'ను సృష్టించిన ఘన చరిత్ర సిరిసిల్లకే దక్కింది. యజమాని నుండి కార్మికుని వరకు మధ్యలో కలిగిన అనేక విభాగాలలో వ్యవస్థ సమ్మేళితంగా మనుగడ సాగుతున్న క్రమంలో.. కార్మికులు, ఆసాములు, యజమానులు మూడు దశల్లో పరిశ్రమ విరాజిల్లుతుంది. మొదటగా కొన్ని ఏళ్ల శ్రమతో కార్మికుడిగా మొదలై ఆసాములుగా, యజమానులుగా ఎదిగిన వారు ఉన్నారు. కుటీర పరిశ్రమలోని అనేక మూలాలలో వారి మధ్య అనుబంధం కనిపిస్తుంది. నేతవృత్తిని నమ్ముకున్న కుటుంబాలలో ఇంటిల్లిపాది శ్రమించి వస్త్రోత్పత్తిలో భాగమవడం సిరిసిల్ల నేత పరిశ్రమలో ఒక ప్రత్యేకం. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన సిరిసిల్ల నేత వర్గంలో అనేక ఏళ్లుగా ఉత్పత్తిలో మాంద్యంను అనేక సార్లు ఎదుర్కొన్నారు. అయినా వాళ్లు నమ్ముకున్న వృత్తిని వీడలేదు. చేనేత బతుకు జీవన పోరాటంలో నిత్యం ఒక ఆవిష్కరణ కోసం అన్వేషణ జరుగుతూనే ఉంటుంది. ఆనాడు చేనేత మగ్గం ద్వారా ఉత్పత్తి గావించి అనేక అద్భుతాలు సృష్టించారు. నేడు ఆధునిక రేపర్ లూమ్స్‌పై కూడా వారి మార్కును చాటుకున్నారు. కాలక్రమేణా అనేక కొత్త ఉత్పత్తి యంత్రాలు రూపుదాల్చుకున్ననూ మార్కెట్ ఎగుడు దిగుడు పరిస్థితులను ఎదుర్కోవడం వారికి తప్పలేదు. అందుకు ప్రత్యేక కారణంగా ఒకసారి పరిశీలిస్తే దేశంలో బొంబై, సూరత్, సోలాపూర్, అహ్మదాబాద్, గుజరాత్, భీవండిలలో వస్త్ర ఉత్పత్తి కేంద్రీకృతమైన విషయం అందరికీ తెలిసిందే. సిరిసిల్ల వస్త్ర ఉత్పత్తి పరిశ్రమతో దేశంలో ప్రసిద్ధి చెందిన వస్త్ర ఉత్పత్తి కేంద్రాలను పోల్చి చూస్తే అనేక వ్యాపార ఉత్పత్తి విభాగాలు భిన్నంగా ఉంటాయి. అందుకు ప్రత్యేక కారణంగా చెప్పాలంటే సిరిసిల్లకు రవాణా సదుపాయాలలో రైలు మార్గం లేకపోవడం, పెద్ద మార్కెట్లకు అనుసంధానంగా లేకపోవడం ఇది ఒక వెనుకబాటు అని చెప్పవచ్చు. ముడిసరుకులు గానీ, తయారైన ఉత్పత్తులు గానీ ఎగుమతి దిగుమతి విషయంలో నేరుగా సంబంధాలు పెద్ద మార్కెట్లతో లేకపోవడం జరుగుతుంది. తయారైన వస్త్రాన్ని ఇతర రాష్ట్రాల మార్కెట్లలోకి నేరుగా గతంలో ప్రస్తుతం ఎగుమతి చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు దక్కకపోవడం గమనార్హం. సిరిసిల్లలో టెక్స్‌టైల్ పార్క్, అపెరల్ పార్కు కలవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌పిఎం, చీరల తయారీ, మ్యాక్స్ సొసైటీలు, నూలు డిపో ఇలా సిరిసిల్ల నేత వర్గాలకు ఇచ్చి ఊరట కలిగించాయి. మరిన్ని పథకాలను కూడా ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త విధానాలను కూడా సిరిసిల్ల నేత వర్గానికి అందివ్వడం ప్రభుత్వాలు చేస్తున్న కృషికి నిదర్శనం. నైపుణ్యత, కళాత్మకతలతో పాటు వృత్తిపై బాధ్యతతో శ్రమించి పని చేసే తత్వం కలిగిన నేత వర్గానికి ఆదరించే అవకాశాలు, పథకాలు పెద్దపీట వేస్తున్నాయి.

# మహమ్మారి వ్యాధిలో మరో రకం!



మధుమేహం అనేది ఇవాళ కొత్తగా వెలుగు చూసిన వ్యాధి కాదు. దశాబ్దాల తరబడి ప్రపంచవ్యాప్తంగా కోరలు చాస్తూ, వేల సంఖ్యలో ప్రాణాలు కబళిస్తోంది ఈ మహమ్మారి. హిందూ, ఈజిప్టు ప్రాచీన గ్రంథాలలో సైతం ఈ వ్యాధి ప్రస్తావన ఉందంటే ఇది ఎంత పురాతనమైనదో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు గోరుచుట్టుపై రోకటి పోటులా ఈ వ్యాధిలోనే మరో రకం బయటపడటం, అది ప్రాణాంతకమని వైద్యనిపుణులు పదేపదే హెచ్చరికలు జారీ చేస్తూ ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

మధుమేహంలో టైప్ 1, టైప్ 2 అనే రకాలు ఉన్నాయని మాత్రమే అందరికీ తెలుసు. కానీ, కొత్తగా టైప్ 5 రకం బయటపడినట్లు ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ (ఐడిఎఫ్) ఇటీవల అధికారికంగా ప్రకటించింది. బ్యాంకాక్‌లో జరిగిన సదస్సులో ఐడిఎఫ్ ప్రతినిధులు టైప్ 5 లక్షణాల గురించి వివరిస్తూ, పోషకాహార లోపంతో ఈ వ్యాధి పొడసూపుతోందనడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అమితాహారం తీసుకోవడం మధుమేహ కారకాల్లో ఒకటి కాగా, పోషకాలు లోపించడమూ మధుమేహానికి దారితీస్తుందనడం ఆశ్చర్యం కాక మరేమిటి? సాధారణంగా 40 ఏళ్ల పైబడినవారిలోనే మధుమేహ లక్షణాలు బయటపడటం కద్దు కాగా, టైప్ 5 రకానికి 19 ఏళ్ల లోపు యువత ఎక్కువగా లోనవుతున్నట్లు ఐడిఎఫ్ స్పష్టం చేస్తోంది. టైప్ 1, టైప్ 2 రకాలను మందులు లేదా ఇంజెక్షన్లతో అదుపు చేసే అవకాశం ఉండగా, టైప్ 5 మధుమేహాన్ని గుర్తించడమూ, నయం చేయడమూ కూడా కష్టమేనన్నది వైద్యనిపుణుల అభిప్రాయం. ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామ లేమి, జన్యుపరమైన కారణాల వల్ల ఎక్కువగా సంక్రమించే మధుమేహ వ్యాధికి ఆసియా దేశాలే చిరునామాగా మారాయి. అందులోనూ చైనా, ఇండియా, పాకిస్తాన్‌లదే అగ్రస్థానం. ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్థులు ఉండగా, ఒక్క మన దేశంలోనే ఆ సంఖ్య ఏడున్నర కోట్లకు పైగా ఉన్నట్లు అంచనా. అంతెందుకు, పాతికేళ్లలోపు వయసున్న ప్రతి నలుగురిలోనూ ఒకరికి టైప్ 2 డయాబెటిస్ ఉన్నట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) లెక్కగట్టడం కలవరం కలిగించే విషయమే. 1980లో ప్రపంచవ్యాప్తంగా 10.8 కోట్ల మంది మధుమేహ రోగులు ఉండగా, 2014 నాటికి ఈ సంఖ్య 40 కోట్లకు పెరిగిందంటే ఈ వ్యాధి విస్తరణ ఎంత ప్రమాదకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇక తెలుగు రాష్ట్రాలలోనూ మధుమేహ విస్తృతి అంతకంతకూ ఎక్కువవుతోంది. మధుమేహ వ్యాధిగ్రస్థుల సంఖ్యలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో ఉందన్న సంగతి విస్మరించరాని విషయం. టైప్ 5 డయాబెటిస్ ను 1955లో తొలిసారిగా జమైకాలో గుర్తించినట్లు చెబుతున్నారు. దీనిని ఒక విభిన్నమైన మధుమేహంగా 1985లో ప్రపంచ ఆరోగ్య సంస్థ వర్గీకరించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా టైప్ 5 డయాబెటిస్ బారినపడిన వారి సంఖ్య రెండున్నర కోట్లకు పైమాటేనని వైద్యులు చెబుతున్నారు. పోషకాహార లేమి కారణంగా ఈ వ్యాధి సంక్రమిస్తున్నట్లు వైద్యుల పరిశోధనలలో తేలిన నేపథ్యంలో పేదలే ఎక్కువగా దీనిబారిన పడే ప్రమాదం ఉంటుంది. వైద్య నిపుణులు చెబుతున్న దానిని బట్టి టైప్ 5 రకం మధుమేహాన్ని గుర్తించేందుకు, నిర్ధారించేందుకు అవసరమైన విధానాలపై విస్తృత పరిశోధనలు జరగవలసిన అవసరం ఉంది. మొదటి రెండు రకాలకు ఈ కొత్త రకం తోడై, ప్రజల ప్రాణాలను కబళించక ముందే ప్రభుత్వాలు మేలుకొనడం మంచిది. వైద్య పరిశోధనలకు నిధులు కేటాయించడంతోపాటు ఈ సరికొత్త రకం వ్యాధి గురించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరం. ఇటీవల చెన్నైలో ఏర్పడిన డయాబెటిస్ బయో బ్యాంకుల వంటివి దేశవ్యాప్తంగా విస్తరించాలి. జీవనమూనాలను సేకరించి ప్రాసెస్ చేయడం, నిల్వ చేయడంతోపాటు ఐసిఎంఆర్ తోడ్పాటుతో పరిశోధనలు సాగించే బయో బ్యాంకులు మధుమేహంపై యుద్ధం చేయడంలో భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తాయడంలో సందేహం లేదు. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలంటారు. నియంత్రణే గానీ నివారణ లేని మధుమేహం ముప్పునుంచి భావిభారతాన్ని తప్పించేందుకు పటుతరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం.

భారత్ రిపోర్టర్ BHARATH REPORTER

## సంపాదకీయం

# చోక్సీ కథ కంచికేనా!

## (విశ్లేషణ)

ప్రపంచంలో మనుషుల్ని అమెరికన్ వ్యంగ్య రచయిత జార్జి ప్రెంటిస్ మూడు రకాలుగా విభజించాడు - కలవారు, లేనివారు, అప్పులు చెల్లించనివారు. కానీ ఆయన గమనించి వుండకపోవచ్చు గానీ...మన దేశంలో ఇంకోరకం ఘరానా మనుషులున్నారు- కేవలం ఎగ్గొట్టడానికే అప్పులు చేసే వారు! పైగా అందుకోసం ప్రభుత్వరంగ బ్యాంకుల్ని మాత్రమే ఎంచుకునేవారు!! ఆ బాపతు మోసగాళ్లలో అగ్రభాగానవున్న మెహుల్ చోక్సీ ఏడేళ్ల తర్వాత బెల్జియంలో పట్టుబడ్డాడు. ఆయనగారు దొరకడం ఇది మొదటిసారేమీ కాదు.2021 మే నెలలో వెస్టిండీస్‌కు దగ్గర్లో కరీబియన్ సముద్ర ప్రాంత ద్వీప దేశమైన యాంటీగాలో మన సీబీఐ బృందం అరెస్టు చేసింది. అప్పటికే చోక్సీ ఆ దేశ పౌరసత్వం తీసుకోవటం, యాంటీగాతో మనకు నేరస్తుల మార్పిడి ఒప్పందం లేకపోవటం పర్యవ సానంగా విడుదల చేయక తప్పలేదు. తనకొచ్చిన ప్రాణాంతక వ్యాధికి చికిత్స కోసం బెల్జియం రావటంవల్లా, ఆ దేశంతో మనకు నేరస్తుల మార్పిడి ఒప్పందం ఉండటంవల్లా ఎట్టకేలకు అరెస్టయ్యాడు.మన బ్యాంకులు సాధారణ రైతులు, మధ్యతరగతి ప్రజానీకం అప్పుకోసం వస్తే సవాలక్ష యక్ష ప్రశ్నలతో వేధిస్తాయి. అనుమానాస్పద వ్యక్తుల్ని చూసినట్టు చూస్తాయి. కానీ మెహుల్ చోక్సీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యావంటి మోసగాళ్లకు రెడ్‌కార్పెట్ పరుస్తాయి. అడిగిందే తడవు ఉన్నదంతా ఊడ్చిపెట్టి ఇవ్వడానికి సిద్ధపడిపోతాయి. మెహుల్ చోక్సీ, నీరవ్ మోదీ ఇద్దరూ బంధువులు మాత్రమే కాదు... జంట కేటుగాళ్లు. వీరిద్దరూ ఎంత లాఘవంగా పంజాబ్ నేషనల్ బ్యాంకును దోచారంటే- 2011లో మోసాలు మొదలెడితే దాన్ని ఆనవాలు కట్టడం 2018 వరకూ బ్యాంకు సిబ్బందికి సాధ్యమే కాలేదు. ఇది బ్యాంకుల చేతగానితనం అనుకోవాలా, ఉన్నతస్థాయిలో పనిచేసే వారి చేతివాటం అనుకోవాలా? లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్‌ఓయూ)ల్ని బ్యాంకునుంచి అపహరించి రూ. 13,500 కోట్లు కొట్టేశారంటే బ్యాంకు ఉన్నతాధికారగణం నిద్రపోయినట్టా, నిద్ర నటించినట్టా? ఈ ఎల్‌ఓయూలతో ఇద్దరూ విదేశీ ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులనుంచి వేల కోట్ల రూపాయలు కొట్టేశారు. ఎల్‌ఓయూలను ఆమోదించేముందు వాటిని జారీచేసిన ప్రధాన బ్యాంకును సంప్రదించటం తప్పనిసరి.అదేం జరగలేదు సరిగదా బ్యాంకు అంతర్గత ఆడిట్‌లో సైతం ఇది లెక్కకు రాకుండా చూసుకోవటం వీరిద్దరి ప్రత్యేకత! మోసం బయటపడినప్పుడు పంజాబ్ నేషనల్ బ్యాంకుకు పోయిన సొమ్మెంత అన్న స్పృహ కూడా లేదు. మొదట రూ. 11,000 కోట్లని నిర్ధారణ చేయగా, తవ్వినకొద్దీ బయటపడుతూ అది పాపం పెరిగినట్టు పెరిగి చివరకు రూ. 13,500 కోట్ల దగ్గర ఆగింది.కనీసం అప్పనంగా కొట్టేసిన డబ్బుతో 'అధికారికంగా' ఉన్న బాకీలో కాస్తయినా తీర్చుదామని వారనుకోలేదు. ఎల్‌ఓయూ ద్వారా తీసుకునే అప్పును మూణ్ణెల్లలో తీర్చేయాలి. కొనసాగించదల్చుకుంటే దానిపై వడ్డీ ఉంటుంది. కానీ అప్పిచ్చిన బ్యాంకులు కనీసం వడ్డీ వసూలుకు కూడా ప్రయత్నించలేదు.అయినా బ్యాంకులు మేల్కొన్నాయా? నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) చిట్టా గమనిస్తే పెద్దగా సంతో షించాల్సింది కనబడదు. 2019లో రూ. 7.3 లక్షల కోట్ల మేర ఉన్న ప్రభుత్వ బ్యాంకుల ఎన్‌పీఏలు నిరుడు రూ. 3.4 లక్షల కోట్లకు తగ్గాయి. కానీ ఇంకా మొండి బకాయిలు రూ. 3.9 లక్షల కోట్లు న్నాయి. ఎగవేతదారులకు రాజకీయ ప్రాపకం దొరకటం, అది బ్యాంకులకు సమస్యగా మారటం ఇందుకు కారణం కావొచ్చు.కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక తెలుగు దేశం నుంచి ఆ పంచన చేరిన ఇద్దరు నాయకులు ఎగవేతదారులే. అందులో ఒకరు కేంద్రమంత్రి పదవి కూడా వెలగబెట్టారు. ఇప్పుడు ఎమ్మెల్యే అయ్యారు. మరొకరు ఎంపీ. నిజంగా బ్యాంకులు తమ బకాయిలు రాబట్టుకోవటానికి ప్రయత్నించినా పెద్దగా ఫలితం వుండదు.చోక్సీ సంగతే తీసు కుంటే పరారయ్యాక అతగాడి దుకాణాన్ని సీజ్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అక్కడ రూ. 5,000 కోట్ల కిమ్మత్తు చేసే వజ్రాలున్నాయని ప్రకటించింది. తీరా వాటిని లెబోరేటరీల్లో పరీక్షిస్తే అన్నీ నకిలీ వని తేలింది. ఇతరేతర స్థిరాస్తులు రూ. 2,500 కోట్లుగా తేల్చారు. కానీ కొట్టేసిన సొమ్ముతో పోలిస్తే, దానికి ఇప్పటివరకూ అయిన వడ్డీ కూడా జతచేస్తే అది ఏ మూలకు? థాయ్‌లాండ్, దుబాయ్, జపాన్, అమెరికాల్లో చోక్సీకున్న ఆస్తుల విలువ దాదాపు వంద కోట్లని చెబుతున్నారు.చోక్సీ అరెస్టు మన ప్రభుత్వ దౌత్య విజయమని, దేశం గర్వించదగ్గదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ చెబుతున్నారుగానీ అంతగా సంతోషించదగ్గదేమీ లేదు. ఎందుకంటే, చోక్సీ తోడుదొంగ నీరవ్ మోదీ 2019లో లండన్‌లో అరెస్టుకాగా ఇప్పటికీ అక్కడి న్యాయస్థానాల్లో తనను భారత్‌కు అప్పగించొద్దంటూ పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తున్నాడు. ఈ వరస ఎన్నాళ్లు కొనసాగుతుందో తెలియదు. బెల్జియం న్యాయస్థానాలు సైతం చోక్సీ అప్పగింతపై ఓ పట్టాన నిర్ణయం తీసుకోవు.మానవ హక్కుల ఉల్లంఘన, నిర్బంధంలో చిత్రహింసలు వగైరా కారణాలు చూపుతూ ఏళ్ల తరబడి కాలక్షేపం చేయగలడు. బ్యాంకులకు రూ. 9,000 కోట్లు ఎగ్గొట్టి పరారైన విజయ్ మాల్యా కేసు గతీ అంతే. 2017లో అరెస్టయ్యాక బెయిల్‌పై విడుదలై ఇప్పటికీ తనను భారత్ పంపకుండా న్యాయస్థానాల్లో అడ్డుకుంటున్నాడు. వీరందరినీ వెనక్కి తీసుకొచ్చి శిక్షపడేలా చూస్తే పోగొట్టుకున్న డబ్బు రాకపోయినా కనీసం అలాంటి మోసగాళ్లకు అదొక హెచ్చరికగా ఉంటుంది. కానీ అది కూడా అత్యాశేనని జరుగుతున్న పరిణామాలు చెబుతున్నాయి.

# సాయిరెడ్డి స్థానంలో రాజ్యసభకు కూటమి అభ్యర్ధిగా - ఢిల్లీ మార్క్ నిర్ణయం..!!



ఏపీలో రాజ్యసభ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల అయింది. వైసీపీ ఎంపీగా సాయిరెడ్డి రాజీనామా తో ఈ ఉప ఎన్నిక జరగనుంది. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలంతో ఈ స్థానం కూటమి కే దక్కనుంది. సాయిరెడ్డి రాజీనామా వెంటనే ఈ స్థానం పైన ఢిల్లీ నేతలు స్పష్టత ఇచ్చారు. ఏపీలో కూటమిలోనే కొనసాగుతూనే బీజేపీ పట్టు పెంచుకుంటోంది. సాయిరెడ్డి విషయంలోనూ అనూహ్య నిర్ణయాలు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ ఉప ఎన్నిక వేళ బీజేపీ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో కీలకంగా మారుతోంది.

ఈసీ షెడ్యూల్

ఏపీ నుంచి కూటమి మరో రాజ్యసభ స్థానం దక్కించుకోనుంది. వైసీపీ నేత సాయిరెడ్డి రాజీనామా తో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 22న నోటిఫికేషన్ జారీ కానుంది. 29వ తేదీ వరకు నామినేషన్లకు చివరి గడువు. వైసీపీకి సంఖ్యా బలం లేకపోవటంతో ఏకగ్రీవంగానే ఎన్డీఏ సీటు గెలుచుకోనుంది. కాగా, కూటమి నుంచి రాజ్యసభకు వెళ్లే కొత్త అభ్యర్ధి ఎవరు. రాజ్యసభ విషయంలో మాత్రం బీజేపీ పట్టు బిగించింది. ఏపీ విషయంలో తాము పట్టువిడుపులతో ఉంటామని.. పార్లమెంట్ అంశంలో మాత్రం తమ పార్టీకే ప్రాధాన్యత ఉండాలని బీజేపీ నేతలు కోరుకుంటున్నారు. అందులో భాగంగానే గతంలో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయితే.. తొలుత మూడు పార్టీలకు ఒక్కొక్కటి చొప్పున తీసుకోవాలని భావించినా.. చివరకు టీడీపీ నుంచి వచ్చిన అభ్యర్ధనతో పవన్ తన సోదరుడు సీటును త్యాగం చేసారు.

సాయిరెడ్డి స్థానంలో

బీజేపీ ఖాతాలో ఇప్పుడు విజయ సాయిరెడ్డి రాజీనామాతో మరో రాజ్యసభ సీటు కూటమికి దక్కనుంది. అయితే, ఈ సీటు మూడు పార్టీల్లో ఎవరికి వారు తమకే అనే అంచనాతో ఉన్నారు. కానీ, సాయిరెడ్డి ఖాళీ చేసిన స్థానం బీజేపీకి దక్కనుంది. ఇప్పటికే ఢిల్లీ బీజేపీ నాయకత్వం చంద్ర బాబు, పవన్ కు స్పష్టం చేసి నట్లు సమాచారం. సామాజిక సమీకరణాల ఆధారంగా రాజ్యసభకు అభ్యర్ధులను ఎంపిక చేయాల్సి వస్తోంది. వైసీపీ నుంచి ముగ్గురు బీసీ రాజ్యసభ ఎంపీలు కూటమి లో చేరారు. తిరిగి మూడు సీట్లలో రెండు బీసీ వర్గాలకే కేటాయించారు. ఇప్పుడు రెడ్డి వర్గానికి చెందిన సాయిరెడ్డి రాజీనామాతో అదే వర్గానికి రాజ్యసభ సీటు ఇవ్వాలని భావిస్తున్నారు. కొత్త అభ్యర్థి జూన్ 2028 వరకు ఎంపీగా కొనసాగే అవకాశం ఉంటుంది. సీమ ప్రాంతానికే బీజేపీ ఈ సీటు తీసుకోవాలని ఇప్పటికే నిర్ణయించింది. బీసీ వర్గానికి చెందిన ఆర్ క్రిష్ణయ్యకు ఏపీ నుంచి రాజ్యసభకు పంపినా.. తెలంగాణ లో ఆయన సేవలు వినియోగించుకోనుంది.

### పదో తరగతి ఫలితాలపై బిగ్ ట్విస్ట్- ఆ స్పష్టత వచ్చాకే..!!

బీజేపీ అభ్యర్ధిగా అదే విధంగా ఏపీ నుంచి సాయిరెడ్డి స్థానంలో బీజేపీ నుంచి ముగ్గురి పేర్లు బలంగా ప్రచారంలో ఉన్నాయి. అందులో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి, జీవీఎల్ నరసింహరావు తో పాటుగా ఒక ప్రముఖ పారిశ్రామిక వేత్త పేరు ప్రచారంలోకి వచ్చింది. ఇదే సమయంలో సాయిరెడ్డి సైతం బీజేపీ నేతలతో టచ్ లోకి వెళ్లినట్లు ఆ పార్టీ నేతల సమాచారం. సాయిరెడ్డి బీజేపీలో చేరేందుకు టీడీపీ నుంచి అభ్యంతరం వస్తుండటంతో ఆయన చేరిక ప్రక్రియ ఆలస్యం అయిందని చెబుతున్నారు. లిక్కర్ కేసులో సాయిరెడ్డికి మరోసారి నోటీసులు జారీ అయ్యాయి. దీంతో, ఈ సారికి సాయిరెడ్డి ఛాన్స్ లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సీటు బీజేపీకే ఖాయంగా కనిపిస్తోంది. అయితే, ఏపీ నేతలకే అవకాశం ఇస్తారా.. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా అనూహ్యంగా కొత్త వారికి ఛాన్స్ ఇస్తారా అనేది ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది.

# ట్రంప్‌కు కీలెరిగి వాత

## చైనా ఖనిజ ఎగుమతుల నిషేధంపై నిపుణులు

## అమెరికా రక్షణ వ్యవస్థపై పెను ప్రభావం



అరుదైన ఖనిజాల ఎగుమతుల నిలిపివేత ద్వారా అమెరికాను చైనా నేరుగా కుంభస్థలంపైనే కొట్టిందని పరిశీలకులు అంటున్నారు. దీని ప్రభావం అమెరికా రక్షణ శాఖపై భారీగా ఉండనుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఫైటర్ జెట్లు తదితరాల తయారీని ఇది తీవ్రంగా ప్రభావితం చేయడం ఖాయంగా కన్పిస్తోంది. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తవుతున్న మొత్తం అరుదైన ఖనిజాల్లో ఏకంగా 70 శాతం వాటా చైనాదే! అమెరికా వాటా 11.4 శాతం. కానీ దేశీయ, ముఖ్యంగా రక్షణ అవసరాలను తీర్చేందుకు ఆ నిల్వలు ఏ మూలకూ చాలవు. మలేసియా, జపాన్ సహా పలు దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నా అవి 30 శాతం అవసరాలనే తీర్చగలుగుతున్నాయి.

దాంతో మరో దారిలేక అగ్ర రాజ్యం ఇంతకాలంగా చైనా దిగుమతులపైనే ప్రధానంగా ఆధారపడుతూ వస్తోంది. తన అరుదైన ఖనిజ అవసరాల్లో 70 శాతం అక్కడినుంచే దిగుమతి చేసుకుంటోంది. చైనా ఇప్పుడు సరిగ్గా గురి చూసి ఆ కీలకమైన సరఫరా లింకును మొత్తానికే తెగ్గొట్టింది. 17 రకాల అరుదైన ఖనిజాల్లో సమారియం, గాడోలినియం, టెర్బియం, డైస్ప్రోరియం, లుటేటియం, స్కాండియం, ఇత్రియం రూపంలో ప్రస్తుతానికి ఏడింటికి ఎగుమతుల నిషేధాన్ని వర్తింపజేసింది. వీటితో పాటు పలు కీలక లోహాలు, అయస్కాంత వస్తువులను కూడా ఈ జాబితాలో చేర్చింది. ఇకపై చైనా కంపెనీలు వీటిని ఎగుమతి చేయాలంటే ప్రత్యేక లైసెన్సులు తీసుకోవాల్సిందే. చైనా నిర్ణయం పలు అమెరికానే గాక చాలా దేశాలనూ ప్రభావితం చేయనుంది. ముఖ్యంగా యూరప్ దేశాలకైతే పిడుగుపాటే. వాటి అరుదైన ఖనిజాల అవసరాల్లో సగటున 46 శాతం దాకా చైనా దిగుమతులపైనే ఆధారపడుతున్నాయి.

### అనుమానమే నిజమైంది

అత్యంత కీలకమైన ఖనిజ అవసరాల కోసం చైనాపై ఆధారపడటం ఎప్పటికైనా ప్రమాదమేనని అమెరికా రక్షణ శాఖ ముందునుంచీ మొత్తుకుంటూనే ఉంది. ఇది జాతీయ భద్రతకే ముప్పని 2024 మార్చి 11న అధ్యక్షునికి పంపిన ఓ నోట్‌లో స్పష్టంగా పేర్కొంది కూడా. ఈ విషయంలో అమెరికాతో పాటు ప్రపంచ దేశాల్లో చాలావరకు చైనామీదే ఆధారపడాల్సి రావడంపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. ఆ భయాలే ఇప్పుడు నిజమయ్యాయి. రక్షణ పాటవం పెంచుకోవడంలో అమెరికా, చైనా కొన్నేళ్లుగా నువ్వా, నేనా అన్నట్టుగా పోటీ పడుతున్నాయి. కీలక ఖనిజాలపై ఆంక్షలతో ఈ పోటీలో అగ్ర రాజ్యాన్ని దాటి చైనా దూసుకెళ్లేలా కన్పిస్తోంది. ఈ సమస్యను అధిగమించే మార్గాలపై అమెరికా రక్షణ శాఖ కొంతకాలంగా గట్టిగా దృష్టి సారించింది. దేశీయంగా అరుదైన ఖనిజాల ఉత్పత్తి సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంచుకునేలా 'మైన్ టు మాగ్నెట్' పేరిట ఐదేళ్ల ప్రణాళికను సిద్ధం చేసింది. కానీ ఆలోగా జరిగే అపార నష్టాన్ని భర్తీ చేసుకునే మార్గాంతరాలు కన్పించక ట్రంప్ సర్కారు తలపట్టుకుంటోంది.

### అన్నింట్లోనూ అవే కీలకం

ఫైటర్ జెట్లు మొదలుకుని కీలకమైన రక్షణ వ్యవస్థలన్నింట్లోనూ అరుదైన ఖనిజాలది కీలక పాత్ర. ఎఫ్-35 యుద్ధ విమానాలు, వర్జీనియా-కొలంబియా శ్రేణి జలాంతర్గాములు, తోమహాక్ క్షిపణులు, రాడార్ వ్యవస్థలు, ప్రిడేటర్ శ్రేణి మానవరహిత వైమానిక వాహనాలు, మ్యునిషన్ సిరీస్ స్మార్ట్ బాంబులు... ఇలా దేని తయారీకైనా అవి కావాల్సిందేనని సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ వివరించింది.

ఒక ఎఫ్-35 యుద్ధ విమానం తయారీకి 900 పౌండ్ల (400 కిలోల) మేరకు అరుదైన ఖనిజాలు కావాలి.

అర్లే బ్రూక్ శ్రేణి డీడీజీ-51 డిస్ట్రాయర్ యుద్ధనౌక తయారీకి ఏకంగా 5,200 పౌండ్లు (2,300 కిలోలు) అవసరం.

అదే వర్జీనియా శ్రేణి జలాంతర్గామి నిర్మాణానికి 9,200 పౌండ్ల (4,173 కిలోల) అరుదైన ఖనిజాలు అవసరం.

ఆందోళనకరమే

### ఖనిజాలపై చైనాతో చర్చిస్తాం

### ట్రంప్ ఆర్థిక సలహాదారు

వాషింగ్టన్: అరుదైన ఖనిజాలు, కీలక లోహాలు, అయస్కాంత పదార్థాల ఎగుమతులను నిలిపేస్తూ చైనా తీసుకున్న నిర్ణయం అమెరికాను తీవ్ర ఆందోళనకు గురిచేసే అంశమేనని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక సలహాదారు కెవిన్ హసెట్ అంగీకరించారు. సోమవారం ఆయన వైట్‌హౌస్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. "ఆ అరుదైన ఖనిజాల అవసరం రక్షణ, టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు చాలా ఉంటుంది. చైనా నిర్ణయాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నాం. ఈ విషయమై మాకు అందుబాటులో ఉన్న అన్ని ఇతర అవకాశాలనూ పరిశీలిస్తాం" అని చెప్పుకొచ్చారు. బహుశా డ్రాగన్ దేశంతో తాము చర్చలు జరిపే అవకాశాలు లేకపోలేదన్నారు. చైనా నిర్ణయంతో పలు యూరప్ దేశాల్లో కూడా ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్లు తదితర కంపెనీలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అభిప్రాయపడ్డారు. ట్రంప్ ప్రతీకార సుంకాల వల్ల అమెరికా ఆర్థిక మాంద్యం కోరల్లో చిక్కుతుందన్న వాదనను హసెట్ తోసిపుచ్చారు. అమెరికా, చైనా మధ్య తీవ్రస్థాయి టారిఫ్‌ల పోరు సాగుతున్న విషయం తెలిసిందే.

# కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం.. భారత్ ఫ్రెండే.. బట్ కండిషన్స్ అప్లై అంటన్న యూఎస్!




అమెరికాతో భారత్ బంధం కొంచెం ఇష్టం.. కొంచెం కష్టంగా మారింది. ఓవైపు మిత్రు దంటూనే.. ఆంక్షల కొరడా ఝులిపిస్తోంది అమెరికా. ఓవైపు చైనాను ఢీకొట్టాలంటే అమెరికాకు కనిపిస్తున్న బుల్లెట్ పాయింట్ బారతే. అందుకే అమెరికా ఫస్ట్ విధానంతో ఆంక్షలు కురిపిస్తూనే.. డిఫెన్స్ డీల్‌తో మనకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తోంది. మరి అమెరికా ఆడుతున్న గేమ్‌లో భారత్ ఎలాంటి వ్యూహంతో ముందుకెళుతోంది..? అన్నదీ హాట్ టాపిక్‌గా మారింది. 2025 ఫిబ్రవరి 13న భారత ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌ను కలిసినప్పుడు.. మేక్ ఇండియా గ్రేట్ అగైన్ అనే లెవల్లో ఆలింగనాలు, చర్చలు జరిగాయి. కానీ అమెరికా స్నేహం వెనుక ట్రేడ్ టారిఫ్‌లు, ఇమిగ్రేషన్ డ్రామాలు, చైనాతో ఛాలెంజ్‌లు మనల్ని ఆలోచనలో పడేశాయి. భారత్ మిత్రదేశమే.. బట్ రూల్స్ ఫాలో కావాల్సిందే అంటూ ట్రంప్ బిజినెస్ స్ట్రోక్ ఇచ్చాడు. భారత్‌పై 26% రెసిప్రోకల్ టారిఫ్‌లు ప్రకటించాడు. గతంలో 3-4% మాత్రమే ఉన్న సుంకం.. ఇప్పుడు ఆకాశాన్ని తాకే పరిస్థితి. ఈ సుంకాల ఎఫెక్ట్‌కు ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్స్ ఎగుమతులు కుదేలయ్యాయి. కానీ, ఇక్కడే ట్విస్ట్ దాగుంది. ప్రధాని మోదీ అమెరికన్ ఆయిల్, గ్యాస్ ఇంపోర్ట్‌లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, టారిఫ్ టెన్షన్‌ను కొంత సమతుల్యం చేశారు.. సుంకాల ఎఫెక్ట్ భారత్‌పై ప్రభావం చూపుతున్నా.. అమెరికా-భారత్ మధ్య రక్షణ సహకారం ఊపందుకుంది. 2025 ఫిబ్రవరిలో ప్రారంభమైన అమెరికా-యూఎస్ రక్షణ ఒప్పందం.. భారత్ డిఫెన్స్‌ను మరింత బలోపేతం చేస్తోంది. చైనా డ్రాగన్‌ను ఢీకొట్టాలంటే.. భారత్‌తో జట్టు కట్టాలన్నదే ట్రంప్ వ్యూహం. ఇందులో భాగంగా అమెరికా నుంచి 8 బిలియన్ల డాలర్ల విలువైన రక్షణ దిగుమతులతో భారత సైన్యం అప్‌గ్రేడ్ అవుతోంది. అలాగని అప్పుడే సంబరపడలేం. అమెరికా ఎజెండాకు భారత్ పూర్తిగా లొంగిపోకూడదంటున్నారు నిపుణులు. ఆయుధాలు ఇస్తాం, కానీ మా రూల్స్ పాటించాల్సే అంటున్న ట్రంప్ మన స్వేచ్ఛను లాగేసే అవకాశం ఉంది. ఇక్కడ భారత్ అప్రమత్తంగా ఉండాలంటున్నారు అంతర్జాతీయ నిపుణులు. ట్రంప్ ఉగ్రవాదంపై భారత్‌కు గట్టి మద్దతు ఇచ్చాడు. 2025లో ముంబై దాడుల కుట్రదారు తహవ్వుర్ రాణాను భారత్‌కు అప్పగించడం అత్యంత కీలమైన విషయం. భారత్‌కు దెబ్బ తగిలితే తాము చూస్తూ ఊరుకోమన్న మెసేజ్ అమెరికా నుంచి చాలా స్పష్టంగా వచ్చింది. జైష్-ఎ-మొహమ్మద్, లష్కర్-ఎ-తొయిబా లాంటి గ్రూపులపై అమెరికా తీవ్ర ఒత్తిడి పెంచుతోంది. పాకిస్థాన్‌ను కూడా ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వొద్దని హెచ్చరిస్తోంది. అంతేకాదు ట్రంప్ చైనాపై ఫోకస్‌తో ఇండో-పసిఫిక్‌లో భారత్‌ను సూపర్‌స్టార్‌గా చూస్తున్నారు. ఈ విషయంలో నో డౌట్. 2025లో ప్రారంభమైన ఇండియన్ ఓషియన్ స్ట్రాటజిక్ వెంచర్ భారత్-అమెరికా సహకారాన్ని ఆర్థిక, రక్షణ రంగాల్లో మరింత బూస్టప్‌ని ఇచ్చేలా చేస్తోంది. QUAD సమావేశాలు చైనాకు గట్టి కౌంటర్ అటాక్. 2025లో ఢిల్లీలో జరగనున్న QUAD సమ్మిట్‌లో ట్రంప్ స్వయంగా హాజరవుతారని టాక్.

"చైనా గేమ్ ఆడితే, QUAD తో భారత్ చెక్‌మేట్ అవుతుందన్న చర్చ గ్లోబల్ వైజ్ జరుగుతోంది. కానీ, ట్రంప్ రష్యాతో రాపో బిల్డ్ చేస్తున్న నేపథ్యంలో భారత్ జాగ్రత్తగా ఉండాలంటున్నారు విశ్లేషకులు. రష్యా-భారత్ డిఫెన్స్ బంధం అమెరికా ఎన్నటికీ ఒప్పుకోదు. అందుకే చైనాతో ఫైట్ చేయ్, కానీ రష్యాతో రొమాన్స్ ఆపు అన్నది ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. ఇది భారత్‌ను ఇబ్బందుల్లో పెట్టే అంశం. అంతేకాదు 2024లో గౌతమ్ అదానీపై అమెరికా ఆరోపణలు, సిఖ్ పై హత్యాయత్నం ఆరోపణలు లాంటివి అమెరికాతో సంబంధాలను టెన్షన్‌లో పడేసే అంశాలు. అందుకే అమెరికా స్నేహంపై భారత్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలంటారు నిపుణులు ట్రంప్ చైనాపై యుద్ధం ప్రకటించడంతో, భారత్‌కు గ్లోబల్ సప్లై చైన్‌లో స్టార్‌గా ఎదిగే ఛాన్స్ వచ్చింది. 2025లో మెటా ఇండియన్ ఓషన్‌లో 50 బిలియన్ డాలర్ల అండర్‌సీ కేబుల్ ప్రాజెక్ట్‌లో ఇన్వెస్ట్ చేస్తోంది. దీంతో భారత్ డిజిటల్ హబ్‌గా మారే అవకాశం ఉంది. చైనా బై, ఇండియా హాయ్..అంటూ గ్లోబల్ కంపెనీలు కూడా భారత్‌తో ట్యూన్ అవబోతున్నాయి. అలాగే టెస్లా, స్టార్‌లింక్ లాంటి అమెరికన్ బిగ్‌షాట్‌లు భారత్‌లో ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లు వేస్తున్నాయి. ఇండియా ఎక్స్‌పోర్ట్-ఫ్రెండ్లీ పాలసీలు అమెరికన్ కంపెనీలను ఆకర్షిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్‌లతో కొడితే.. తాము ఇన్వెస్ట్‌మెంట్‌లతో గెలుస్తాం అన్నట్టుగా భారత్ ధీమాగా ఉందిప్పుడు. మొత్తానికి ట్రంప్ టారిఫ్‌లు, వీసా ఆంక్షలతో భారత్‌ను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నా.. డిఫెన్స్ డీల్స్, అమెరికాతో చైనా గ్యాప్ మనల్ని ఆకాశానికి తీసుకెళ్తున్నాయి. భారత్ ఈ గేమ్‌లో గెలవాలంటే, స్వావలంబన, స్మార్ట్ డిప్లొమసీ కీలకం అన్నది విశ్లేషకుల మాట..!

Postal Licenced No: HDP/010/2024-2026
RNI.APTEL:2023/88573
BHARATH REPORTER

## సుమీ దాడులపై ఐక్యరాజ్యసమితి కార్యదర్శి వ్యాఖ్యలపై స్పందించిన రష్యా



మాస్కో : ఏప్రిల్ 13 సుమీ నగరంపై రష్యా క్షిపణి దాడి చేసినట్లు ఉక్రెయిన్ వెల్లడించింది. ఈ దాడుల వల్ల 20 మందికిపైగా మృతి చెందారు. ఈ దాడులపై ఐక్యరాజ్యసమితి కార్యదర్శి ఆంటోనియో గుటెరాస్ రష్యా చర్యను తప్పుపడుతూ పరోక్షంగా వ్యాఖ్యానించారు. గుటెరస్ వ్యాఖ్యలపై మంగళవారం రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మరియా జఖరోవా స్పందించారు. 'ఐక్యరాజ్యసమితి కార్యదర్శి గుటెరస్ వ్యాఖ్యలు గందరగోళ వ్యాఖ్యలుగానే భావించాలి. ఎందుకంటే రష్యన్ దళాలు మొదటి నుంచి జనాభాను లక్ష్యంగా చేసుకుని ఉద్దేశపూర్వకంగా దాడులు చేయలేదు. కేవలం సైనిక స్థావరాల్ని మాత్రమే లక్ష్యంగా రష్యన్ దళాలు దాడులు చేస్తాయి' అని ఆమె వెల్లడించినట్లు మీడియా వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ చట్టం, తీర్మానాలకనుగుణంగా ఉక్రెయిన్ సార్వభౌమాధికారం, స్వాతంత్ర్యం, ప్రాదేశిక సమగ్రతను కాపాడటం కోసం శాంతిని సాధించే ప్రయత్నాల్లో భాగంగానే గుటెరస్ ఆ ప్రకటను చేసి ఉంటారని రష్యా జఖరోవా అన్నారు. అలాగే జెలెన్‌స్కీ చర్యలపైనా ఆమె మండిపడ్డారు. రష్యా జాతికి చెందిన వారిని, రష్యన్ భాష మాట్లాడేవారిపై జెలెన్‌స్కీ బృందం ప్రాథమిక నియమాలను పదేపదే ఉల్లంఘిస్తోంది. వారిపైన దాడులు చేస్తోంది. భాషా, మతం, మానవ హక్కులను గౌరవించాలని ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఆర్టికల్ 1 పిలుపునిస్తుంది. ప్రజల స్వయం నిర్ణయాధికారం, మానవ హక్కులను గౌరవించడం అనే చట్టబద్ధమైన సూత్రాల పట్ల కైవ్ పాలన నిర్లక్ష్యాన్ని మాత్రం ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఎప్పుడూ కప్పిపుచుతూనే ఉంటారు అని జఖరోవా చురకలంటించారు.

## ఇకపై కదిలే రైళ్లలోనూ ఎటిఎం సేవలు..!



అమరావతి : ఇండియన్ రైల్వే సరికొత్త ప్రయోగం చేపట్టింది. ఇకపై కదిలే రైళ్లల్లో కూడా ఎటిఎం సర్వీసును సెంట్రల్ రైల్వే ప్రయాణీకులకు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఎటిఎం సర్వీసును ఏర్పాటు చేశారు. ట్రయల్ రన్‌ను అధికారులు పరిశీలించారు. ఈ ప్రయోగం విజయవంతమైతే దేశ వ్యాప్తంగా అన్ని రైళ్లలో ఎటిఎం సర్వీసులు రానున్నాయి. రైల్వే అధికారులు మాట్లాడుతూ మొదటిసారిగా ముంబయిమన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఏటీఎంను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ నడిచే ఈ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రైవేట్ బ్యాంకుకు చెందిన ఎటీఎంను ఏసీ ఛైర్‌కార్ కోచ్‌లో ఏర్పాటు చేశామన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో ఈ సదుపాయాన్ని ప్రయాణీకులందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా దీన్ని ఏర్పాటు చేశామని, సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా తెలిపారు. కోచ్‌లో గతంలో తాత్కాలిక ప్యాంట్రీగా వినియోగించిన స్థలంలోనే ఏటీఎం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రైలు ముందుకు వెళేటప్పుడు భద్రతా పరంగా ఇబ్బందులు లేకుండా షట్టర్ డోర్ అమర్చారనీ, దీనికి సంబంధించిన కోచ్‌లో కూడా అవసరమైన మార్పులు మన్మాడ్ వర్క్‌షాప్‌లో చేశామని స్పష్టం చేశారు. అయితే ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినల్ నుంచి మన్మాడ్ జంక్షన్ వరకు ప్రతిరోజూ పంచవటి ఎక్స్‌ప్రెస్ వెళుతుంది. దాదాపు 4 గంటల 30 నిముషాల్లో గమ్యస్థానానికి చేరుకునే ఈ రైలు ఆ మార్గంలో కీలకంగా ఉంది. అందుకే ముందుగా ఈ రైల్లో ప్రయోగాత్మకంగా ఏటీఎం సేవలను అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. త్వరలోనే మిగతా మార్గాల్లో కూడా రైళ్లలో ఏటీఎం సేవలు అందించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ప్రభుత్వంపై సుప్రీం సీరియస్..
## కంచ గచ్చిబౌలి భూములపై విచారణ వాయిదా



కంచ గచ్చిబౌలి భూముల కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వంపై మరోసారి సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వివాదాస్పదంగా మారిన 400 ఎకరాల ఈ భూముల్లో చెట్లను తొలగించడంపై సుప్రీం ఆదేశాలతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అఫిడవిట్ దాఖలు చేశారు. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానికి చెందినవే అని అఫిడవిట్ లో తెలిపారు. బుధవారం ఈ భూములపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. 100 ఎకరాల్లో చెట్ల తొలగింపుకు ముందస్తు అనుమతులు తీసుకున్నారా? అని ప్రశ్నించింది. తిరిగి 100 ఎకరాల్లో చెట్ల పునరుద్ధరణ చేయాలని.. లేకపోతే చీఫ్ సెక్రటరీని, సంబంధిత అధికారులను జైలుకు పంపుతామని జస్టిస్ గవాయ్ హెచ్చరించినట్లు సమాచారం. తీర్పు వచ్చే వరకు చెప్పే వరకు ఆ భూముల్లో ఒక్క చెట్టును నరకవద్దని ఆదేశించారు. తదుపరి విచారణ మే 15కు సుప్రీం వాయిదా వేసింది.

## గుడ్ న్యూస్ చెప్పిన చైనా, ఏకంగా 85వేల వీసాలు



ఆంక్షలు, టారిఫ్‌లు అంటూ ప్రపంచ దేశాలను ముఖ్యంగా చైనాకు అమెరికా చుక్కలు చూపిస్తోంది. దీంతో చైనా ఇండియాతో సన్నిహితంగా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రజల మధ్య సంబంధాలను పునరుద్ధరించే లక్ష్యంతో తాజాగా చైనా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు, భారతీయులకు 85 వేల వీసాల ను జారీ చేసినట్లు చెప్పింది. చైనా రాయబారి జు ఫీహాంగ్ ఎక్స్‌లో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. భారతీయ సందర్శకులకు ప్రయాణాన్ని సులభతరం చేయడానికి, చైనా అనేక వీసా సడలింపులను ప్రవేశపెట్టింది. ఇండియా-చైనా దేశాల మధ్య ఏర్పడుతున్న దృఢమైన బంధానికి ఇది నిదర్శనమని స్పష్టం చేసింది. చైనాకు వస్తున్నన్న 85 వేల ఇండియన్లకు వీసాలు ఇచ్చినట్లు జూ ఫీహంగ్ తెలిపారు. తమన దేశంలో పర్యటించాల్సిందిగా ఎక్కువ మంది భారతీయ మిత్రులను కోరుతున్నట్లు వెల్లడించారు. భారత్, చైనా మధ్య ట్రావెల్‌ను ఈజీ చేసేందుకు అనేక సదుపాయాలు కల్పించినట్లు చైనీస్ ప్రభుత్వం చెప్పింది. అంతేకాదు వీసాకోసం దరఖాస్తుదారులు ఇకపై ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్‌లను బుక్ చేసుకోవలసిన అవసరం లేదనీ, ఇప్పుడు పని దినాలలో వీసా కేంద్రాలలోకి నేరుగా తమ దరఖాస్తులను అందచేయ వచ్చని కూడా చైనా ప్రకటించింది. చాలా తక్కువ టైం కోసం చైనా వెళ్లే వారు బయోమెట్రిక్ డేటాను సమర్పించాల్సిన అవసరం లేదు. ఇది దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేస్తుంది అలాగే చాలా తక్కువ ధరకే చైనా వీసాను అందిస్తున్నట్లు చెప్పారు. కొనసాగుతున్న దౌత్యపరమైన ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ సాంస్కృతిక, వ్యాపార విద్యా సంబంధాలను విస్తృతం చేయడానికి రెండు దేశాలు ప్రయత్నాల మధ్య ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.

# థెరపిస్టు చాట్‌జీపీటీ

### ప్రేమ మొదలుకుని వృత్తి సమస్యల దాకా... సమస్యల పరిష్కారానికి ఏఐతో చాటింగ్ యువతలో క్రమంగా పెరుగుతున్న ధోరణి



లవ్ బ్రేకప్.. ఒంటరితనం.. ఆఫీసులో కోపిష్టి బాస్ వేధింపులు.. సహోద్యోగులతో ఇబ్బందులు.. జీవితంలో ఏ సమస్య వచ్చినా చెప్పుకోవడానికి, ఓపిగ్గా వినేవారొకరు ఉండాలి. తీరా చెప్పాక జడ్జ్ చేయకుండా ఉంటారా? నిష్పాక్షికంగా పరిష్కార మార్గం సూచిస్తారా? అనుమానమే. ఇలాంటి పరిస్థితుల్లో సాధారణంగా మానసిక వైద్యులను సంప్రదిస్తారు. కానీ ఇప్పుడు ట్రెండు మారుతోంది. ఈ విషయంలో చాట్‌జీపీటీకే జనం ఓటేస్తున్నారు. సమస్యలను వినే మంచి ఫ్రెండ్‌గానే గాక వాటికి పరిష్కారం చూపే కౌన్సిలర్‌గా కూడా భావిస్తున్నారు.

### లైఫ్ కౌన్సిలర్

27 ఏళ్ల మనీశ్ ఇంజనీర్. ప్రియురాలితో గొడవైంది. అపార్థాలతో బంధానికి బ్రేక్ పడింది. మానసికంగా అలసిపోయి ఓ సాయం వేళ చాట్‌జీపీటీని ఆశ్రయించాడు. సమస్యంతా చెప్పాడు. ఏం చేయాలో పాలుపోవడం లేదన్నాడు. చాట్‌జీపీటీ సమాధానం మనోన్ని ఆశ్చర్యపరిచింది. "మీరు చెప్పింది ఆమె వినకపోవడం మిమ్మల్ని బాధిస్తోంది. అదే విషయం ఆమెకు నేరుగా చెప్పారా?"అని అడిగింది. అంతటితో ఆగకుండా ప్రేయసికి సందేశం పంపడంలో మనీశ్‌కు సాయపడింది. ఆమెను నిందించకుండా కేవలం అతని ఫీలింగ్స్ మాత్రమే వ్యక్తపరిచే ప్రశాంతమైన, నిజాయితీతో కూడిన నోట్ అది. అందుకున్న ఆ అమ్మాయి మనీశ్ తో మాట్లాడింది. ఇంకేముంది వారి మధ్య దూరం తగ్గిపోయింది.

### వృత్తి సమస్యల్లో సాయం

26 ఏళ్ల అక్షయ్ శ్రీవాస్తవ కంటెంట్ రైటర్, మీడియా ప్రొఫెషనల్. ఆఫీసుకు వెళ్లిరావడానికే నాలుగ్గంటలు పోతోంది. నిద్ర లేదు. కుటుంబంతో గడపడానికి లేదు. ఫిర్యాదులా కాకుండా ఈ విషయాన్ని బాస్‌తో ఎలా చెప్పాలో తేలక చాట్‌జీపీటీని ఆశ్రయించాడు. వాడాల్సిన పదాలతో సహా చక్కని నిర్మాణాత్మక సలహాలిచ్చింది. అప్పటినుంచి అక్షయ్ క్రమం తప్పకుండా చాట్‌బాట్‌ను ఆశ్రయిస్తున్నాడు. ఆయేషాది మరో సమస్య. ఇన్నాళ్లు సహోద్యోగిగా ఉన్న స్నేహితులకే బాస్ అయింది. సాన్నిహిత్యం కోల్పోకుండా వాళ్లతో ఎలా డీల్ చేయాలని చాట్‌జీపీటీనే అడిగింది. అదిచ్చిన సమాధానం ఎమోషనల్ ఇంటెలిజెన్స్‌లో క్రాష్ కోర్సులా సాయపడింది.

### బెటర్ కౌన్సిలర్?

ఒక్కోసారి కౌన్సిలర్ కంటే మెరుగ్గా చాట్‌జీపీటీ ఇచ్చే సమాధానాలు ఆశ్చర్యపరుస్తున్నాయి. జీవితంలో చాలా కోల్పోయానని అపిస్తుందనే ప్రశ్నకు.. 'మార్పు జరిగినప్పుడు అది మామూలే. అభిరుచులను పెంచుకోండి'అని కౌన్సిలర్ చెప్పారు. చాట్‌జీపీటీ మాత్రం, 'సంతోషపరిచే పనులు చేయండి. చిన్న లక్ష్యాలు పెట్టుకుని చేరుకునే ప్రయత్నం చేయండి'అని సూచించింది. స్నేహితులు అర్థం చేసుకోవడం లేదంటే వారితో ఓపెన్‌గా మాట్లాడమని థెరపిస్టు చెబితే, 'స్నేహితుల్లో అపార్థాలు మామూలే. వారితో నిజాయితీగా మాట్లాడండి'అని చాట్‌జీపీటీ సూచించింది. పని నచ్చడం లేదంటే ఒత్తిళ్లను గుర్తించి పరిష్కారానికి కొత్తగా ప్రయత్నించమని కౌన్సిలర్ చెప్పాడు. చాట్‌జీపీటీ మాత్రం, 'పనిలో పరిమితులను పెట్టుకోండి. హెచ్‌ఆర్ లేదా మెంటార్‌తో మాట్లాడండి. మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోండి'అని సలహా ఇచ్చింది. భాగస్వామితో విభేదాలపై ఓపెన్‌గా మాట్లాడుకుని, సమస్యకు కారణాలేంటో కనిపెట్టి పరిష్కారానికి కలిసి ప్రయత్నించండన్న చాట్‌జీపీటీ సూచనే మెరుగ్గా ఉందని నెటిజన్లు మెచ్చుకుంటున్నారు.

### ప్రత్యామ్నాయం కాబోదు: మానసిక వైద్యులు

మానసిక వైద్యం మనదేశంలో కాస్త ఖరీదైన విషయం. జనంలో అవగాహన లేమి కూడా ఉంది. ఆ సమస్యలకు చాలామంది క్రమంగా ఏఐపై ఆధారపడుతున్నారు. అది జడ్జ్ చేయదు. చెబుతుంటే మధ్యలో అడ్డుకోదు. ఏం చెప్పినా, ఎంతసేపు చెప్పినా, ఎప్పుడు చెప్పినా శ్రద్ధగా వింటుంది. అంతే ఓపిగ్గా సమాధానమూ ఇస్తుంది. దాంతో వ్యక్తిగతం నుంచి వృత్తిపరమైన సలహాల దాకా యూత్ చాట్‌జీపీటీపై ఆధారపడుతోంది. కానీ ఈ చాట్‌బాట్ మానసిక ఇబ్బందులకు మొత్తంగా పరిష్కారం చూపలేదంటున్నారు వైద్యులు. "అది తాత్కాలిక ఉపశమనమిచ్చే ఔట్‌లెట్‌లా పనిచేస్తుందంతే. పూర్తిస్థాయి మానసిక చికిత్స ప్రక్రియకు ప్రత్యామ్నాయం కాబోదు. సహానుభూతి, అంతర్దృష్టి, అవగాహన వాటికుండవు"అంటున్నారు. అంతేగాక ఏఐ థెరపీ బాట్లతో ముప్పు కూడా ఉంటుందని అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ హెచ్చరించింది. ప్రత్యేకించి వాటిని పిల్లలు వాడటంపై ఆందోళన వ్యక్తం చేసింది. మనుషులను అవి మరింత ఒంటరులను చేస్తాయనీ హెచ్చరించింది.

# ట్రంప్‌కు కీలెరిగి వాత

### చైనా ఖనిజ ఎగుమతుల నిషేధంపై నిపుణులు
### అమెరికా రక్షణ వ్యవస్థపై పెను ప్రభావం



అరుదైన ఖనిజాల ఎగుమతుల నిలిపివేత ద్వారా అమెరికాను చైనా నేరుగా కుంభస్థలంపైనే కొట్టిందని పరిశీలకులు అంటున్నారు. దీని ప్రభావం అమెరికా రక్షణ శాఖపై భారీగా ఉండనుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఫైటర్ జెట్లు తదితరాల తయారీని ఇది తీవ్రంగా ప్రభావితం చేయడం ఖాయంగా కన్పిస్తోంది. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తవుతున్న మొత్తం అరుదైన ఖనిజాల్లో ఏకంగా 70 శాతం వాటా చైనాదే! అమెరికా వాటా 11.4 శాతం. కానీ దేశీయ, ముఖ్యంగా రక్షణ అవసరాలను తీర్చేందుకు ఆ నిల్వలు ఏ మూలకూ చాలవు. మలేసియా, జపాన్ సహా పలు దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నా అవి 30 శాతం అవసరాలనే తీర్చగలుగుతున్నాయి. దాంతో మరో దారిలేక అగ్ర రాజ్యం ఇంతకాలంగా చైనా దిగుమతులపైనే ప్రధానంగా ఆధారపడుతూ వస్తోంది. తన అరుదైన ఖనిజ అవసరాల్లో 70 శాతం అక్కడినుంచే దిగుమతి చేసుకుంటోంది. చైనా ఇప్పుడు సరిగ్గా గురి చూసి ఆ కీలకమైన సరఫరా లింకును మొత్తానికే తెగ్గొట్టింది. 17 రకాల అరుదైన ఖనిజాల్లో సమారియం, గాడోలినియం, టెర్బియం, డైస్ప్రోరియం, లుటేటియం, స్కాండియం, ఇత్రియం రూపంలో ప్రస్తుతానికి ఏడింటికి ఎగుమతుల నిషేధాన్ని వర్తింపజేసింది. వీటితో పాటు పలు కీలక లోహాలు, అయస్కాంత వస్తువులను కూడా ఈ జాబితాలో చేర్చింది. ఇకపై చైనా కంపెనీలు వీటిని ఎగుమతి చేయాలంటే ప్రత్యేక లైసెన్సులు తీసుకోవాల్సిందే. చైనా నిర్ణయం పలు అమెరికానే గాక చాలా దేశాలనూ ప్రభావితం చేయనుంది. ముఖ్యంగా యూరప్ దేశాలకైతే పిడుగుపాటే. వాటి అరుదైన ఖనిజాల అవసరాల్లో సగటున 46 శాతం దాకా చైనా దిగుమతులపైనే ఆధారపడుతున్నాయి.

అనుమానమే నిజమైంది

అత్యంత కీలకమైన ఖనిజ అవసరాల కోసం చైనాపై ఆధారపడటం ఎప్పటికైనా ప్రమాదమేనని అమెరికా రక్షణ శాఖ ముందునుంచీ మొత్తుకుంటూనే ఉంది. ఇది జాతీయ భద్రతకే ముప్పని 2024 మార్చి 11న అధ్యక్షునికి పంపిన ఓ నోట్‌లో స్పష్టంగా పేర్కొంది కూడా. ఈ విషయంలో అమెరికాతో పాటు ప్రపంచ దేశాల్లో చాలావరకు చైనామీదే ఆధారపడాల్సి రావడంపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. ఆ భయాలే ఇప్పుడు నిజమయ్యాయి. రక్షణ పాటవం పెంచుకోవడంలో అమెరికా, చైనా కొన్నేళ్లుగా నువ్వా, నేనా అన్నట్టుగా పోటీ పడుతున్నాయి. కీలక ఖనిజాలపై ఆంక్షలతో ఈ పోటీలో అగ్ర రాజ్యాన్ని దాటి చైనా దూసుకెళ్లేలా కన్పిస్తోంది. ఈ సమస్యను అధిగమించే మార్గాలపై అమెరికా రక్షణ శాఖ కొంతకాలంగా గట్టిగా దృష్టి సారించింది. దేశీయంగా అరుదైన ఖనిజాల ఉత్పత్తి సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంచుకునేలా 'మైన్ టు మాగ్నెట్' పేరిట ఐదేళ్ల ప్రణాళికను సిద్ధం చేసింది. కానీ ఆలోగా జరిగే అపార నష్టాన్ని భర్తీ చేసుకునే మార్గాంతరాలు కన్పించక ట్రంప్ సర్కారు తలపట్టుకుంటోంది.

### అన్నింట్లోనూ అవే కీలకం

ఫైటర్ జెట్లు మొదలుకుని కీలకమైన రక్షణ వ్యవస్థలన్నింట్లోనూ అరుదైన ఖనిజాలది కీలక పాత్ర. ఎఫ్-35 యుద్ధ విమానాలు, వర్జీనియా-కొలంబియా శ్రేణి జలాంతర్గాములు, తోమహాక్ క్షిపణులు, రాడార్ వ్యవస్థలు, ప్రిడేటర్ శ్రేణి మానవరహిత వైమానిక వాహనాలు, మ్యునిషన్ సిరీస్ స్మార్ట్ బాంబులు... ఇలా దేని తయారీకైనా అవి కావాల్సిందేనని సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ వివరించింది. ఒక ఎఫ్-35 యుద్ధ విమానం తయారీకి 900 పౌండ్ల (400 కిలోల) మేరకు అరుదైన ఖనిజాలు కావాలి. అర్లే బ్రూక్ శ్రేణి డీడీజీ-51 డిస్ట్రాయర్ యుద్ధనౌక తయారీకి ఏకంగా 5,200 పౌండ్లు (2,300 కిలోలు) అవసరం. అదే వర్జీనియా శ్రేణి జలాంతర్గామి నిర్మాణానికి 9,200 పౌండ్ల (4,173 కిలోల) అరుదైన ఖనిజాలు అవసరం.

### ఆందోళనకరమే
### ఖనిజాలపై చైనాతో చర్చిస్తాం
### ట్రంప్ ఆర్థిక సలహాదారు

వాషింగ్టన్: అరుదైన ఖనిజాలు, కీలక లోహాలు, అయస్కాంత పదార్థాల ఎగుమతులను నిలిపేస్తూ చైనా తీసుకున్న నిర్ణయం అమెరికాను తీవ్ర ఆందోళనకు గురిచేసే అంశమేనని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక సలహాదారు కెవిన్ హసెట్ అంగీకరించారు. సోమవారం ఆయన వైట్‌హౌస్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. "ఆ అరుదైన ఖనిజాల అవసరం రక్షణ, టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు చాలా ఉంటుంది. చైనా నిర్ణయాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నాం. ఈ విషయమై మాకు అందుబాటులో ఉన్న అన్ని ఇతర అవకాశాలనూ పరిశీలిస్తాం" అని చెప్పుకొచ్చారు. బహుశా డ్రాగన్ దేశంతో తాము చర్చలు జరిపే అవకాశాలు లేకపోలేదన్నారు. చైనా నిర్ణయంతో పలు యూరప్ దేశాల్లో కూడా ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్లు తదితర కంపెనీలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అభిప్రాయపడ్డారు. ట్రంప్ ప్రతీకార సుంకాల వల్ల అమెరికా ఆర్థిక మాంద్యం కోరల్లో చిక్కుతుందన్న వాదనను హసెట్ తోసిపుచ్చారు. అమెరికా, చైనా మధ్య తీవ్రస్థాయి టారిఫ్‌ల పోరు సాగుతున్న విషయం తెలిసిందే.

# అల్లర్లకు చిరునామా బెంగాల్



పశ్చిమ బెంగాల్‌లో ఒకదాని వెంట ఒకటిగా చోటుచేసుకుంటున్న వివాదాలు ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలకు సవాలుగా పరిణమిస్తున్నాయి. నిరుడు పార్ల మెంటు ఎన్నికలకు ముందు జరిగిన సందేశ్ ఖలీ మానభంగాల కేసు, గత ఏడాది చివర్లో కోల్‌కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసు ఎంతటి పెను వివాదాలకు కారణమయ్యాయో తెలిసిందే. ఈ మధ్య 26 వేల మంది స్కూలు టీచర్ల నియామకాలను సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టడంతో మరో వివాదం దీదీ ప్రభుత్వాన్ని అతలాకుతలం చేస్తుండగా, గోరుచుట్టుపై రోకటిపోటులా తాజాగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లు మొదలయ్యాయి. వారం రోజుల క్రితం వక్ఫ్ సవరణ చట్టం అమలులోకి రాగా, దేశంలో ఎక్కడా లేనంత తీవ్ర స్థాయిలో బెంగాల్‌లో అల్లర్లు మొదలయ్యాయి. ముస్లిం జనాభా ఎక్కువగా గల ముర్షీదాబాద్, మాల్డా, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాలు నిరసనలతో అట్టుడుకుతున్నాయి. ఈ అల్లర్లకు ఇప్పటికే ముగ్గురు బలికాగా, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు భారీస్థాయిలో ధ్వంసమయ్యాయి. నిరసనకారులు ప్రధాన రహదారుల్ని, రైల్వే ట్రాకుల్నీ దిగ్బంధం చేస్తూ ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా అల్లర్లు తగ్గుముఖం పట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అల్లర్ల మాట అలా ఉంచితే, రాష్ట్రంలో విపక్ష భారతీయ జనతాపార్టీ, అధికార తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ స్వప్రయోజనాలకోసం పాకులాడుతూ, జరిగిన సంఘటనకు బాధ్యత మీదంటే మీదేనంటూ దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. బెంగాల్‌లో ఎప్పుడు అల్లర్లు చెలరేగినా దాన్ని ప్రభుత్వ తప్పిదంగా అభివర్ణించే బిజెపి ఈసారి కూడా అదే పాట పాడింది. ఇటీవల 26 వేల మంది టీచర్ల నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వ ప్రతిష్ఠ మంటగలవడంతో దానినుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకు వేసిన ఎత్తుగడ ఇదని కమలనాథులు ఆరోపిస్తున్నారు. దీనిని అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి.. వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిన కేంద్రమే అల్లర్లకు బాధ్యత వహించాలనే రీతిలో మాట్లాడుతున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన చట్టం గురించి కేంద్రాన్నే అడగాలని, రాజకీయాలకోసం అల్లర్లకు దిగవద్దని ఆమె ఇచ్చిన పిలుపునకు నిరసనకారులు ఏమాత్రం స్పందించడంలేదు సరికదా మరింత పేట్రేగిపోతున్నారు. అల్లర్లకు కేంద్ర బిందువైన ముర్షీదాబాద్ జిల్లాలో ముస్లిం జనాభాదే ఆధిపత్యం. ఈ జిల్లాలోని మూడు పార్లమెంటు సీట్లనూ తృణమూల్ గెలుచుకుంది. 22 అసెంబ్లీ స్థానాల్లో 20 సీట్లకు తృణమూల్ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీదే పైచేయి. అలాంటప్పుడు, అల్లర్లు ఎలా చెలరేగాయన్న ప్రశ్నకు అధికార పార్టీనుంచి జవాబు లేకపోవడం గమనార్హం. గతంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడూ ముర్షీదాబాద్ భగ్గుమంది. ఇంతటి సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంలో ముందుజాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేదో ప్రభుత్వమే జవాబు చెప్పాలి. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం అల్లర్ల విషయంలో బాధ్యత విస్మరించి స్వప్రయోజనాలకోసం పాకులాడుతూండటంతో పౌరులే ముందుకొచ్చి బెంగాల్ పరిస్థితిపై జోక్యం చేసుకోవలసిందిగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఈ మేరకు హైకోర్టు జోక్యం చేసుకుని, తక్షణం రాష్ట్రానికి కేంద్ర భద్రతా బలగాలను పంపించాలంటూ ఆదేశించడం గమనార్హం. వక్ఫ్ చట్టంలో లొసుగులున్నాయని ఎవరైనా భావిస్తే, వాటిని న్యాయస్థానాలలో సవాల్ చేసే హక్కు ఉంది. అంతే తప్ప, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అల్లర్లకు దిగడం సమంజసం కాదు. అలాగే, సమాజంలో ఒక వర్గాన్ని బుజ్జగించేందుకుగాను వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి చెప్పడం ప్రజాస్వామిక వ్యవస్థనే పరిహాసం చేసే విధంగా ఉంది. పార్లమెంటు చేసిన చట్టాలను మరో మాట లేకుండా అమలు చేయవలసిన బాధ్యత రాష్ట్రప్రభుత్వాలదే. ఈ విషయంలో రాష్ట్రాలకు ఎలాంటి మినహాయింపులూ ఉండవు. అలాంటప్పుడు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న దీదీ పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని అమలు చేయబోమని ఎలా చెబుతారు? ప్రతిపక్షాల ఆరోపణలను వమ్ము చేసేందుకు దీదీ ప్రభుత్వం అల్లర్లను నిర్దాక్షిణ్యంగా అణచివేసి, తన చిత్తశుద్ధిని నిరూపించుకోవలసిన అవసరం ఉంది. మరో ఏడాదిలో శాసనసభ ఎన్నికలకు సమాయత్తమవుతున్న బెంగాల్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు వాంఛనీయం కాదు.

Editor,Printer,Publisher,Owner By:Kotlapalli Fouziya,Printed At by M/s Fouziya Publication,Door No:26-4-1273/3,Melapuram,Hindupur.Sri Sathya Sai district, Andrapradesh - 515201, bharathreporter@gmail.com,Cell: 9059679786 RNI No.APTEL/ 2023/88573.